


కడప.. కబ్జాలమయం

- జగన్ ఐదేళ్లపాలనలో పేట్రేగిన భూబకాసురులు
- రూ.ఐదువేల కోట్లు భూములు హాంఫట్
- కోట్లకు పడగెత్తిన వైసీపీ నేతలు
- మళ్లీ వస్తే నాశనమే
- ఇళ్లు, పొలాలు లాక్కుంటారు

ఖడ్గం

సినిమాలో ఒక్క చాన్స్ అన్నట్లు... జగన్ కూడా నాకు ఒక్క చాన్స్ ఇవ్వండంటూ జనాలను అడిగారు. సినిమాలో నటన కోసం అయితే.. జగన్ మాత్రం సీఎం కుర్చీ కోసం. తాను సీఎం అయితే పేదల బతుకులు మారుస్తానని హామీల వర్షం కురిపించారు. అయితే పేదల బతుకుల్లో ఎంత మేర వెలుగులు నింపారో కానీ.. ఆయన పాలనకు శ్రీకారం చుట్టగానే జనం సొమ్ముతో కట్టిన ప్రజావేదికను కూల్చి విధ్వంసానికి తెరలేపారు. ఇక జిల్లాలో ఆయన అడుగుజాడల్లో నడుస్తూ.. వైసీపీ నేతలు ప్రభుత్వ, ప్రైవేటు భూములను కొల్లగొట్టి కోట్లకు పడగెత్తారు. ఎకరా రెండు ఎకరాలు కాదు.. కోటి రెండు కోట్లు కాదు... ఈ ఐదేళ్ల జగన్ పాలనలో జిల్లాలో సుమారు ఐదువేల కోట్లు విలువ చేసే భూములను కబ్జా చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



బద్వేలులో ఆక్రమణకు గురైన ఎన్జీవో ప్లాట్లు

(కడప-ఆంధ్రజ్యోతి): గతంలో ప్రభుత్వ భూములు ఖాళీగా ఉంటే వాటిని అధికార పార్టీ నేతలు వారి అనుచరులు, సానుభూతిపరులకు పట్టాలు ఇప్పించేవారు. అయితే వైసీపీ పాలనలో ప్రభుత్వ ఆస్తులను కాదు ప్రైవేటు ఆస్తులపై పడి భూ కాలకేయుల్లా మింగేశారు. ఎక్కడ చూసినా భూకబ్జాలే. జగన్ పాలనలో కొందరు వైసీపీ నేతలు మినహాయిస్తే అందరూ భూకాలకేయుల బాధితులే. కడపలో భూకబ్జాల్లో వచ్చిన లావాదేవీల్లో తేడా రావడంతో వైసీపీకి చెందిన శ్రీనివాసరెడ్డిని సొంత గ్యాంగే హతమార్చింది. ఇక బద్వేలులో నకిలీ పట్టాలు సృష్టించి వంద కోట్లు విలువ చేసే ఇంటిస్థలాల భూములు కబ్జా చేశారు. ప్రొద్దుటూరులో ప్రభుత్వ భూములు కొట్టేయడంతో పాటు ప్రైవేటు ఆస్తులను తక్కువకే లాగేసుకున్నారు. సీఎం సొంత నియోజకవర్గంలో తొండూరు మొదలు అన్ని చోట్ల భూము లు ఆక్రమించారంటారు. ఇలా పల్లె, పట్టణం అనే తేడా లేకుండా జిల్లా అంతా కబ్జాల మయంగా మారిందంటారు. మళ్లీ జగన్ వస్తే ఉన్న ఇళ్లు, భూములు కూడా లాక్కుంటారనే భయం జనాల్లో ఉంది. వైసీపీ నేతల పేరు చెబితేనే కొందరు చిగురుటాకులా వణుకుతున్నారు. జిల్లాలో జరిగిన కబ్జాలను ఒకసారి పరిశీలిస్తే..

కడపలో ల్యాండ్ మాఫియా

పూర్వం భూములకు అంత విలువ ఉండేది కాదు. అదే పన్నెండేళ్ల క్రితం కూడా నగరశివార్లలో భూములకు అంత రేట్లు లేవు. అయితే ఇప్పుడు ఎక్కడ చూసినా ఎకరం కోట్లు పలుకుతోంది. అంటే భూకైలాస్ మాదిరి రేట్లు నడుస్తున్నాయి. ఇదే అదునుగా కడపలో ల్యాండ్ మాఫియా రాజ్యమేలింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రభుత్వ భూములు ఖాళీగా కనిపిస్తే కబ్జా చేశారు. ఇవి చాలవన్నట్లు ప్రైవేటు ఆస్తులపై కన్నేశారు. ఖాళీగా ఎక్కడెక్కడ విలువైన ప్రైవేటు భూములు ఉంటే. అక్కడ కాలకేయుల్లా వాలిపోయి ఆక్రమణలకు పాల్పడ్డారు. ముందుగా భూ యజమానుల గురించి ఆరా తీయడం, బలహీనులైతే అక్కడ అడుగు పెట్టి.. నకిలీ పత్రాలు తెరపైకి తెచ్చి ఆక్రమణలకు తెగబడ్డారు.

- కడప నగరంలోని పాత అమర్ హాస్పిటల్ వద్ద వెంచర్లు వెలిశాయి. ఇక్కడ కూడా వాగు, వంకలకు సంబంధించిన స్థలాన్ని కూడా కలిపేసుకుని లేఅవుట్లు వేసి అమ్మివేసినట్లు తెలుస్తోంది. ఆక్రమిత స్థలం విలువ రూ.5 కోట్లకు పైగా పలుకుతుందని చెబుతున్నారు.
- చిన్నచౌకు రెవెన్యూ భూముల్లో పెద్దఎత్తున భూకబ్జాలు జరిగాయి. శివారు ప్రాంతాల్లో రియల్ భూం నడుస్తోంది. రోడ్డుకిరువైపులా ఎకరం రూ.5 కోట్ల నుంచి రూ.20 కోట్లు మధ్య ఉంటుందని అంచనా. అయితే ఇక్కడ కాలువకు సంబంధించిన వంక పోరంబోకు రూ.3కోట్లు విలువ చేసే సుమారు 50 సెంట్ల స్థలాన్ని చదను చేసి ఆక్రమించినట్లు చెబుతారు. కియా షోరూం సమీపంలో భూములు ఆక్రమించారు.
- సాయిపేటలోని టెలికాంనగర్‌లో ఓ వర్గానికి చెందిన రూ.2కోట్లు విలువ చేసే సుమా రు 50 సెంట్ల స్థలాన్ని ఆక్రమించేసి లే అవుట్ వేసి ప్లాట్లుగా విక్రయించినట్లు చెబుతారు. ఇక దేవునికడప రోడ్డులో ఓ స్థలం ఆక్రమణకు ప్రయత్నించగా వివాదాస్పదంగా మారింది.

రూ.500 కోట్ల భూములు కబ్జా

కడప నగరం విస్తరిస్తోంది. ఇక్కడ నివాస స్థలాలకు డిమాండ్ ఉంటుంది. రింగు రోడ్డు చుట్టూ ఉన్న భూములన్నీ అన్యాక్రాంతానికి గురయ్యాయి. రిమ్స్ మొదలుకుని రాయచోటి రోడ్డు, పులివెందుల రోడ్డు ఇలా అలంఖాన్‌పల్లె టు రాజంపేట రోడ్డు ఇలా చుట్టు ఉన్న ప్రభుత్వ భూములు వాగులు వంకలు, రైల్వేభూములతో పాటు ప్రైవేటు ఆస్తులు కూడా కబ్జా చేశారంటారు. సుమారు కడపలో జరిగిన భూదందాలే రూ.500 కోట్లకు పైగా ఉండవచ్చని అంటారు. నలుగురు నేతలు నగరాన్ని కబ్జాలమయంగా మార్చారు. భూకబ్జాల కోసమే 30 గ్యాంగ్‌లు పురుడు పోసుకున్నాయి. కడపను తూర్పు పడమర ఉత్తరం దక్షిణం మాదిరి కడపను శాసించే నలుగురు పట్టేసుకున్నారు. భూకబ్జాల లావాదేవీలు జరుగుతుండడంతో వైసీపీ నేత శ్రీనివాసరెడ్డిని జూన్ 22న అత్యంత దారుణంగా మర్డరు చేశారు.

భూ కబ్జాలకు అడ్డాగా బద్వేలు

బద్వేలు భూకబ్జాలకు అడ్డాగా మారింది. ఇక్కడ రూ.2వేల కోట్లు విలువ చేసే వ్యవసాయ, నివాస స్థలాల భూములు అన్యాక్రాంతమయ్యాయంటారు. నకిలీ పత్రాలు సృష్టించి రూ. 500 కోట్లు విలువ చేసే భూములు కబ్జాకు గురి చేశారని అంటారు. ఏకంగా నకిలీ పట్టాలు సృష్టించి బద్వేలు, గోపవరం మండలాల్లో గత ప్రభుత్వ హయాంలో సుమారు 5వేల మంది పేదలకు ఇంటిపట్టాలు ఇచ్చారు. అయితే అప్పట్లో ఊరికి చివర ఉండడం, ఆర్థిక సమస్యల కారణంగా కొందరు ఇళ్లు కట్టుకోలేదు. అయితే వాటికి ఫోర్జరీ సంతకాలు సృష్టించి భూములను అన్యాక్రాంతం చేశారు. నకిలీ పట్టాల తయారీలో వైసీపీ నేతలపై కేసుల నమోదు చేశారు.

ప్రొద్దుటూరులో రూ.వందల కోట్ల భూములు హాంఫట్

ప్రొద్దుటూరు రెండో ముంబైగా పేరుంది. అయితే బాంబేలో ఉన్న మాఫియా మాదిరిగా ప్రొద్దుటూరులో అ రాచకాలు జరిగాయి. ఇక్కడ వాగులు వంకలు స్థలాలు ఆక్రమించేశారు. లింగాపురంలో వంద కోట్లు విలువ చేసే 20 ఎకరాల భూమిని లేపేశారు. ఇక 30 కోట్లు విలువ చేసే 2.5 ఎకరాల ఇరిగేషన్ భూమి కబ్జాకు గురైంది. రూ.50 కోట్లు విలువ చేసే చర్చి భూములు మింగేశారు. ఇక పట్టణంలో బీసీలు, ఆర్య వైశ్యలకు చెందిన విలువైన భూములు తక్కువ ధరలకు అంటే. మార్కెట్‌లో రూ. కోటి విలువ ఉంటే వారిని బెదిరించి రూ.20 నుంచి 30 లక్షలకే కొట్టేశారంటారు.



అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములు

బద్వేలు ఎన్‌జీవో ప్లాట్లు, మడకలవారిపల్లె, చెన్నంపల్లెలో ఇలా ఎక్కడ పడితే అక్కడ సుమారు రూ.500 కోట్ల మేర స్థలాలు కొట్టేశారంటారు. ఇక కలసపాడు, కాశినాయన, బికోడూరు వ్యవసాయ భూములు పోరుమామిళ్లలో ఇళ్ల స్థలాలు ఇలా మొత్తం రూ.2వేల కోట్లు విలువ చేసే భూములు అన్యాక్రాంతమయ్యాయి. కమలాపురం నియోజకవర్గంలో కమలాపురం, వల్లూరు, సీకేదిన్నె, పెండ్లిమర్రి, వీఎన్‌పల్లెలో విలువైన ప్రభుత్వ భూములను కబ్జా చేశారు. సుమారు రూ.200 కోట్ల మేర భూములు అన్యాక్రాంతమయ్యాయి. ఇక జమ్మలమడుగు, మైదుకూరు ఇలా అన్ని చోట్ల కలిపితే సుమారు రూ.5వేల కోట్ల విలువ చేసే భూములు ఆక్రమణకు గురయ్యాయని చెబుతారు. వైసీపీ పాలనలో విచ్చలవిడిగా భూకబ్జాలు జరగడంతో సామాన్య జనం వణుకుతున్నారు. మళ్లీ జగన్ అధికారంలోకి వస్తే భూములు, ఇళ్లు ఉండవన్న భయం ఉంది. ఈసారి జగన్‌కు ఓటు వేస్తే వినాశనమే అని జనం భావిస్తున్నారు.



పులివెందుల రోడ్‌షోలో మాట్లాడుతున్న సౌభాగ్యమ్మ

- వైఎస్ వివేకా సతీమణి సౌభాగ్యమ్మ
- ప్రపంచమంతా కడపవైపు చూస్తోంది
- కడప ప్రజలు న్యాయం వైపో, నేరం వైపో..
- తేల్చుకునే సమయం ఆసన్నమైంది
- ఏపీసీసీ చీఫ్, కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిల

ఓట్లతో షర్మిల కొంగు నింపండి

పులివెందుల, మే 9: "ఆడబిడ్డలు పుట్టింటికి వస్తే చీరసారె ఇచ్చి పంపిస్తాం. మీ ఆడబిడ్డలు పుట్టింటికి వచ్చి న్యాయం అడుగుతున్నారు. న్యాయం చేసేందుకు మీ అందరికి సమయం వచ్చింది. అందరం కలిసి షర్మిలకు ఓట్లు వేద్దాం. మీ అందరి ఓట్లతో షర్మిల కొంగు నింపండి" అని వైఎస్ వివేకానందరెడ్డి సతీమణి వైఎస్ సౌభాగ్యమ్మ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. ఏపీసీసీ చీఫ్, కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిల గురువారం పులివెందుల నియోజకవర్గంలో బస్సు యాత్ర చేపట్టారు. వేంపల్లె, వేముల, లింగాల, పులివెందుల మండలాల్లో బస్సు యాత్ర సాగింది. ఈ సందర్భంగా పులివెందుల పూలంగళ్ల సమీపంలో రోడ్‌షోలో షర్మిల మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా ఈ రోజు కడప ఎన్నికలు న్యాయానికి, నేరానికి మధ్య జరుగుతఽన్నాయన్నారు. 40ఏళ్లు సేవ చేసిన వ్యక్తి వివేకానందరెడ్డి అన్నారు. అలాంటి వివేకా హత్య జరిగి ఐదేళ్లు గడిచిందన్నారు. వివేకానందరెడ్డి బిడ్డ డాక్టర్ సునీత న్యాయం కోసం తట్టని తలుపు లేదు, ఎక్కని కోర్టుమెట్టు లేదు, తిరగని పోలీస్ స్టేషన్ లేదన్నారు. అందుకే ప్రజాకోర్టులోనైనా న్యాయం దొరుకుతుందేమోనని రాజశేఖర్‌రెడ్డి బిడ్డ, వివేకానందరెడ్డి బిడ్డ కొంగుచాచి న్యాయం అడగడానికి మీ ముందు నిలబడ్డారన్నారు. ఐదేళ్లుగా ఎంత పోరాటం చేసినా న్యాయం దొరకలేదన్నారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి హోదాలో ఉన్న జగన్‌మోహన్‌రెడ్డి అడ్డుపడ్డారన్నారు. సీబీఐ ఎంక్వైరీ చేసి వివేకా హత్యలో అవినాశ్‌రెడ్డి నిందితుడుగా సాక్ష్యాధారాలతో చూపుతోందన్నారు. ఐదేళ్లుగా వివేకానందరెడ్డి రక్తం ఈ గడ్డమీద న్యాయ కోసం ఆక్రోశిస్తూనే ఉందన్నారు. హత్య జరిగిన రోజు వివేకానందరెడ్డి కేసుపై సీబీఐ ఎంక్వైరీ కోరిన జగన్‌మోహన్‌రెడ్డి ఆ తర్వాత ముఖ్యమంత్రి హోదాలో సీబీఐ అవసరం లేదన్నాడన్నారు. దాచుకోవడానికి ఏమీ లేకపోతే ఎవరు ఎంక్వైరీ చేస్తే మీకేమి? కడిగిన ముత్యంలా బయటకు వస్తారన్న నమ్మకం ఉంటే సీబీఐ ఎంక్వైరీ ఇవ్వడానికి అభ్యంతరమేమిటని ప్రశ్నించారు. వివేకానందరెడ్డికి కొడుకులు లేనప్పుడు రాజశేఖర్‌రెడ్డి కొడుకు వివేకానందరెడ్డికి కొడుకు కాడా అని ప్రశ్నించారు. తండ్రి తర్వాత తండ్రిలాంటి చిన్నాన్న హత్యకు గురైతే నిందితుల పక్షాన మూర్ఖంగా ఎందుకు నిలబడ్డారో సమాధానం చెప్పాలన్నారు. ఐదేళ్లుగా నిందితుడిని కాపాడుకుంటూ రావడమే కాకుండా మళ్లీ అదే నిందితుడు అవినా శ్‌రెడ్డికి టికెట్ ఇచ్చాడన్నారు. అన్యాయం జరుగుతుంటే చూస్తూ ఊరుకునేది కాదు రాజశేఖర్‌రెడ్డి బిడ్డ, ఇక్కడ అన్యాయం జరుగుతోంది కాబట్టి ఈరోజు న్యాయం పక్షాన నిలబడ్డా అన్నారు. ఒక పక్క న్యాయం, మరో పక్క నేరం నిలబడింది మీరు ఏవైపు అన్నారు. కడప ప్రజలు న్యాయం వైపా, నేరం వైపా అని ప్రపంచం మొత్తం చూస్తోందన్నారు. న్యాయాన్ని గెలిపించాల్సిన బాధ్యత, వివేకానందరెడ్డి ఆత్మకు శాంతి కలిగించాల్సిన బాధ్యత కడప ప్రజలపై ఉందన్నారు. మరీ ముఖ్యంగా పులివెందుల ప్రజలపై ఉందన్నారు.

అనంతరం వివేకా సతీమణి సౌభాగ్యమ్మ మాట్లాడుతూ.. అమ్మా.. మన పులివెందుల ఆడబిడ్డలిద్దరు మీముందున్నారని వీళ్లని ఆశీర్వదించాలని కోరారు. వీళ్లు ఐదేళ్లుగా పడుతున్న కష్టం మీకందరికి తెలుసన్నారు. కొంగుచాచి న్యాయం అడుగు తున్నారన్నారు. "ఆడబిడ్డలు పుట్టింటికి వస్తే చీరసారె ఇచ్చి పంపిస్తాం. మీ ఆడబిడ్డలు పుట్టింటికి వచ్చి న్యాయం అడుగుతున్నారు. న్యాయం చేసేందుకు మనమందరం కలిసి షర్మిలకు ఓట్లు వేద్దాం. ఓట్లతో షర్మిల కొంగు నింపండి" అన్నారు. రాజశేఖర్‌రెడ్డి పరిపాలన చూడాలంటే షర్మిలతోనే సాధ్యమన్నారు. వివేకానందరెడ్డి షర్మిలను ఎంపీగా చేయాలనుకున్నారు కానీ అప్పట్లో జరగలేదని, ఇప్పుడు అవకాశం వచ్చిందన్నారు. రోడ్‌షోలో డాక్టర్ సునీత, తులసిరెడ్డి, పులివెందుల ఎమ్మెల్యే అభ్యర్థి ధ్రువకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల.. సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గం. అక్కడ అభివృద్ధి పనులు పరుగులు పెట్టాలి. కానీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మెడికల్ కళాశాల పనులే ఆగిపోయాయి. ఇప్పటికి రెండుసార్లు మెడికల్ కళాశాల పనులు ఆగిపోయాయంటే ఆ కళాశాలపై ప్రభుత్వానికి ఏ మేర చిత్తశుద్ధి ఉందో ఇట్టే అర్థమవుతుంది. ఈ ఏడాదే మెడికల్ కళాశాల ఓపీ విభాగాన్ని ప్రారంభించాలని ఒకానొక సందర్భంలో ప్రభుత్వం ప్రకటించింది. కానీ నేటికి పూర్తికాక పోగా పనులు ఆగిపోయాయి. ఇది సీఎంకే సిగ్గుచేటని ఆ ప్రాంత ప్రజలు బాహాటంగా విమర్శిస్తున్నారు.

సిగ్గు.. సిగ్గు

- సీఎం సొంత ఇలాకాలో ఆగిన మెడికల్ కళాశాల పనులు
- బిల్లులు చెల్లించక పనులు ఆపేసిన కాంట్రాక్టర్లు
- ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి

కడప, మే 9 (ఆంధ్రజ్యోతి): పులివెందులలో అత్యుత్తమ వైద్యాన్ని అందిస్తామని సీఎం జగన్ ప్రకటిం చారు. ఈ మేరకు ఆసుపత్రితో పాటు మెడికల్ కళాశాల పనులు ప్రారంభించారు. దాదా పు రూ.500కోట్లతో 2019 డిసెంబరులో ఈ పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి పనులు ప్రారంభమైనా.. నేటికి పూర్తి కాలేదు. పూర్తికాకపోగా ఇప్పటికి రెండోమారు పనులు ఆగిపోయాయి. ఈ పనులను ఓ ప్రైవేట్ సంస్థకు అప్పగించింది. ఆ ప్రైవేట్ సంస్థ కొంతమేర వేగంగానే పనులు సాగించింది. కానీ ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లులు ఆలస్యమవుతుండడంతో పనులకు బ్రేకులు పడుతూ వచ్చాయి. పనులు ప్రారంభించిన మొదట్లో రూ.50కోట్ల బిల్లులు రాకపోవడతో దాదాపు ఆరు నెలల పాటు ఆగిపోయాయి. అప్పట్లో ముఖ్యమంత్రి సొంత ఊరిలో మెడికల్ కళాశాల పనులు ఆరు నెలలు ఆగిపోవడం ఏమిటని స్థానికులు ప్రశ్నించే పరిస్థితి నెలకొంది.

సొంత నియోజకవర్గంలో మెడికల్ కళాశాల పనులు ఆగిపోవడంతో రాష్ట్రమంతా ముఖ్యమంత్రి ఏం అభివృద్ధి చేస్తారని ప్రతిపక్షాలు విమర్శించాయి. ఎట్టకేలకు ఆరునెలల తర్వాత బిల్లులు చెల్లించడంతో మళ్లీ పనులు మొదలయ్యాయి. అప్పటి నుంచి దాదాపు నెల క్రితం రెండవసారి ఇక్కడి పనులు ఆగిపోయాయి. ఎన్నికల కోడ్ రాకముందు నుంచి బిల్లులు రాకపోవడంతో పనుల్లో వేగం తగ్గింది. చివరకు ప్రభుత్వం నుంచి సహకారం లేదని పనులు ఆపేశారు. దాదాపు రూ.150 కోట్ల మేర బిల్లులు రావాల్సి ఉందని తెలిసింది. ప్రస్తుతానికి ఓపీ, ఐపీ, నర్సింగ్ కళాశాల పనులు పూర్తయ్యాయి. మెడికల్ కళాశాల భవనం, హాస్టల్, వైద్యుల క్వార్టర్స్ నిర్మాణ దశలో ఉన్నాయి. ప్రస్తుతం పనులు ఎక్కడి పనులు అక్కడ ఆపేశారు. దీంతో రెండవసారి మెడికల్ కళాశాల పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం ఎన్నికల సమయం కావడంతో ప్రభుత్వం బిల్లులు ఎప్పుడు చెల్లిస్తుందో ప్రశ్నగానే మిగిలింది. ప్రభుత్వం నుంచి బిల్లులు అందే వరకు పనులు ప్రారంభమయ్యేలా కనిపించడం లేదు. ఏది ఏమైనా పులివెందుల మెడికల్ కళాశాల పనులు ఆపేయడం జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిలువెత్తు సాక్ష్యంలా నిలిచింది.



పులివెందులలో ఆగిపోయిన మెడికల్ కళాశాల నిర్మాణాలు


అరాచక నిరంకుశ పాలనను పారద్రోలాలి

- మార్పు కోసం ప్రజలు ఓటు వేయాలి
- టీడీపీ ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డి



కడప (ఎర్రముక్కపల్లె), మే 9: రాష్ట్రంలో అరాచక నిరంకుశ పాలనను పారద్రోలాలని టీడీపీ ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. మార్పు కోసం ప్రజలందరూ ఒకసారి కూటమి అభ్యర్థికి ఓటు వేయాలని కోరారు. గురువారం కడప నగరం ద్వారకానగర్ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షసపాలన నుంచి ఎప్పుడు విముక్తి అవుతుందా అని ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. ఓటు అనే ఆయుధంతో బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. గత 30 ఏళ్ల నుంచి జిల్లాలో ఒకే కుటుంబం ఆధిపత్య పోరు కొనసాగిస్తోందని.. ప్రజలు ఒకసారి మంచి చెడు గురించి ఆలోచన చేయాలన్నారు. విజన్ ఉన్న వ్యక్తి చంద్రబాబునాయుడు అని.. సీఎంగా చేస్తే అభివృద్ధి, సంక్షేమం రాష్ట్రంలో పరుగులు తీస్తాయన్నారు. ముస్లిం మైనార్టీలకు టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. టీడీపీ హయాంలో మైనార్టీలకు రంజాన్ తోఫా, దుల్హన్ పథకం అమలు చేసిన ఘనత చంద్రబాబుదన్నారు. టీడీపీకి మరో మారు అవకాశం కల్పించాలని కోరారు.

ఓట్లకు.. నోట్ల కట్టలు



- రూ.600 కోట్లు పంపిణీ
- వెయ్యి నుంచి రూ.2500 పంపిణీ
- వైసీపీ సొంత కేడరును నమ్మలేక..
- పులివెందుల సైన్యం పర్యవేక్షణలో ఓటర్లకు నోట్లు
- కడపలో వలంటీర్ల ద్వారా పంపిణీ
- మాకు అవమానం అంటూ కార్పొరేటర్ల మనోవేదన
- రేపటి సాయంత్రంతో ఎన్నికల ప్రచారానికి సమాప్తం
- నేడు సీఎం జగన్ రాక
- రేపు కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ కడపకు

(కడప - ఆంధ్రజ్యోతి): అవును.. సార్వత్రిక ఎన్నికల్లో నోట్లు చిందేస్తున్నాయి. ఓటు కోసం నోట్ల కట్టలను ఎరగా వేస్తున్నారు. 1980-90 దశకంలో ఓటుకు యాభై.. వందో ఇచ్చేవారు. అది కూడా పనులకు వెళ్లే కూలీల జీవనోపాధి దెబ్బతింటుందన్న ఉద్దేశ్యంతో కూలీ డబ్బు లు ఇచ్చేవారు. అప్పుడు ఎన్నికైన ప్రజా ప్రతినిధులు కూడా అంతే నిబద్ధతతో జనం కోసం పనిచేసేవారు. సొంత ఆస్తులు సంపాదంచడం కన్నా.. ప్రజాసేవే పరమావధిగా భావించే వారు. అందుకు తగ్గట్లు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి చిరస్థాయిగా గుర్తుండిపోవాలని తహతహలాడేవారు. అయితే నేడు ప్రజాప్రతినిధులంతా.. ఇళ్లు ఉండగానే దీపం చక్కబెట్టుకోవాలన్న చందంగా.. అధికారంలో రాగానే దోచుకోవడమే లక్ష్యంగా పెట్టుకుం టున్నారు.. ఒకసారి ఎమ్మెల్యే అయితే రెండు మూడు తరాలకు సరిపడా సంపాదించుకుంటున్నారు. అందుకే ప్రజల కూడా మూడ్ మారింది. ఎమ్మెల్యే, ఎంపీలను గెలిపిస్తే మాకేం చేయరు... వెళ్లినా కొందరు సిఫారసు, డబ్బులు ఉంటేనే పనిచేస్తారంటూ కొందరు ఓటర్లు కూడా నోటు కోసం ఆశపడుతున్నారు. ఇక నాయకులకు కూడా మనం ఏం చేయడం లేదు.. ఈ ఎన్నికల్లో గట్టెక్కితే చాలు.. అనుకుంటూ ఓటుకు నోటు ఎరగా వేస్తున్నారు. దీంతో ఈ నెల 13న జరిగే ఎన్నికలలో ఓట్ల కోసమే అభ్యర్థులు రూ.655 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. ఇది కేవలం ఓటర్లకు ఇచ్చే నోటు మాత్రమే. ఇక ప్రచారాలు, నేతల కొనుగోళ్లు కలిపితే రూ.300 కోట్లు పైమాటే. అంటే అన్నీ లెక్కేస్తే.. కడప జిల్లా ఎన్నికల ఖర్చు వెయ్యి కోట్లమాట.

ఓటుకు నోటు

కడప పార్లమెంటు పరిధిలో మొత్తం 16,39,056 ఓట్లు ఉన్నాయి. ప్రస్తుతం జిల్లాలో ఓటు కు రూ.2వేల నుంచి రూ.3వేల మధ్య పంపిణీ చేస్తున్నారు. సరాసరి ఓటుకు రూ2వేలు వేసుకున్నా అంటే ఓటుకు ఇరుపార్టీలు 4వేలు ఇస్తే మొత్తం ఓట్లకు రూ.600 కోట్ల 55 లక్షల పైచిలుకు అవుతుంది. ఇక 80 శాతం ఓట్లకు డబ్బులు పంపిణీ చేసినా కూడా 500 కోట్ల 24 లక్షలు అవుతుంది. ఇప్పటికే ప్రొద్దుటూరులో అధికార పార్టీ 2500 పంపిణీ చేసినట్లు చెబుతున్నారు. ప్రతిపక్షపార్టీ రూ.2వేలు, పులివెందులలో వైసీపీ పల్లెల్లో రూ.2వేలు, పులివెందుల టౌన్‌లో రూ.2500, మైదకూరులో ఇరువురు రూ.2వేలు. కడపలో వెయ్యి, జమ్మలమడుగులో వైసీపీ రూ.2వేలు పంపిణీకి తెరలేపినట్లు చెబుతారు. కమలాపురంలో ఇంకా ఎంత పంచాలనేది గురువారం రాత్రి 10 గంటల వరకు డిసైడ్ కాలేదు.

కడపలో కార్పొరేటర్ల గరం గరం

కడప జిల్లా హెడ్‌క్వార్టరు. ఇది కార్పొరేషన్ 50 డివిజన్లలో 49 మంది వైసీపీ కార్పోరేటర్లు ఉన్నారు. జగన్‌కు పులివెందుల ఎలాగో కడప కూడా అలాంటిదే. ఇక్కడ కార్పొరేటర్లంతా జగన్‌కు వీరాభిమానులే. అయితే ఇప్పుడు ఓటుకు నోటు పంపిణీలో కార్పొరేటర్ల ప్రమే యం లేకుండా పంపిణీ చేయడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. పులివెందుల సైన్యం పర్యవేక్షణలో కడపలో ఓటుకు నోటు కార్యక్రమం జరుగుతుంది. అయితే డబ్బు పంపిణీలో కొంత మంది కార్పొరేటర్లకు సంబంధం లేకుండానే వైసీపీ వలంటీర్లతో పంపిణీ చేస్తుంది. దీన్ని కార్పొరేటర్లు సహించలేకపోతున్నారు. మా ఆధ్వర్యంలో పంచితే డబ్బులు కొట్టేస్తామని అనుమానంతో మమ్మల్ని నమ్మలేకపోతున్నారంటూ గరంగరంగా ఉన్నారు. ఇక గురువారం సాయంత్రం మేయరు సురేష్‌బాబు అడ్డాలోని కల్యాణమండపంలో కడప సిటీ సమావేశం నిర్వహిస్తే నగర అధ్యక్షుని వేదికపై పిలవకపోవడాన్ని కూడా కొందరు కార్పొరేటర్లు గరంగరంగా ఉన్నారు. కార్పొరేటర్లను మమ్మల్ని నమ్మడం లేదని తీవ్రంగా బాధపడుతున్నారు.

రేపు సాయంత్రంతో ప్రచారం సమాప్తం

ఇక సార్వత్రిక ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రం 5గంటలకు ముగియనుంది. ఎన్నికల షెడ్యూలు విడుదల కాకముందే నుంచి హోరాహోరీగా ప్రచారం చేస్తూ వచ్చారు. టీడీపీ అదినేత చంద్రబాబునాయుడు, సీఎం జగన్, పీసీసీ చీఫ్ షర్మిలా జిల్లాలో పర్యటించారు. ఇక కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ మే 11న కడపకు రానున్నారు. రాహుల్‌గాంధీ ప్రత్యేక విమానంలో కడప ఎయిపోర్టుకు 11 గంటలకు చేరుకుంటారు. అక్కడ నుంచి షర్మిలాతో కలిసి హెలిక్యాప్టరులో ఇడుపులపాయ వెళ్లి వైఎస్‌కు నివాళులర్పిస్తారు. అక్కడ నుంచి బయలుదేరి 12.40కు కడప ఎయిర్‌పోర్టు వస్తారు. అక్కడ నుంచి బయలుదేరి 1 గంటకు పుత్తా ఎస్టేట్‌లో జరిగే బహిరంగసభలో రాహుల్ పాల్గొంటారు. సభ ముగియగానే 2గంటలకు బయల్దేరి 2.15కు కడప ఎయిర్‌పోర్టు నుంచి బయల్దేరుతారు.

నేడు కడపకు సీఎం జగన్ రాక

కడప (క్రైం), మే 9: ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం కడపకు రానున్నారు. చిత్తూరు పర్యటన ముగించుకుని జగన్ 3.55 నిమిషాలకు కడప ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుంచి 4.05 నిమిషాలకు బయలుదేరి రోడ్డు మార్గాన కడప పట్టణంలోని సభాస్థలికి 4.15 గంటలకు చేరుకుంటారు. 4.20 నుంచి 5.05 వరకు వన్‌టౌన్ సర్కిల్‌లో జరిగే బహిరంగసభలో పాల్గొంటారు. అనంతరం అక్కడ నుంచి బయలుదేరి 5.40కి కడప ఎయిర్‌పోర్టుకు చేరుకుని గన్నవరం బయలుదేరి వెళతారు.

సీఎం పర్యటన భద్రతా ఏర్పాట్లు పరిశీలన

సీఎం జగన్ కడప నగరంలో ఈనెల 10వ తేదీ శుక్రవారం పర్యటించనున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్ పోలీసు అధికారులను ఆదేశించారు. నగరంలో సీఎం జగన్ గురువారం పర్యటించనున్న హెలిప్యాడ్, సెవెన్‌రోడ్స్ సర్కిల్, టవర్ క్లాక్ ప్రాంతాలను పరిశీలించి బందోబస్తు ఏర్పాట్లపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్ఎస్‌వీ క్రిష్ణారావు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

మద్యపాన నిషేధాస్త్రంతో మహిళలకు జగన్ శఠగోపం



32వ డివిజన్‌లో టీడీపీలో చేరిన వారితో మాధవీరెడ్డి, అమీర్‌బాబు, ఆరిఫుల్లా, మురళీక్రిష్ణ తదితరులు



టీడీపీలో చేరిన మాజీ ఎమ్మెల్సీ షేక్‌హుసేన్ బామ్మర్ది మహబూబ్‌బాషా




ఎర్రముక్కపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ రాష్ట్ర నాయకుడు గోవర్ధన్‌రెడ్డి



కడప నగరంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న మాధవీరెడ్డి

● టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), మే 9 : మహిళల బలహీనతలను కనిపెట్టి మద్యనిషేధం పేరు చెప్పి ఓట్లేయించుకుని సీఎం సీటు ఎక్కి వారికి జగన్‌మోహన్‌రెడ్డి శఠగోపం పెట్టారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి ధ్వజమెత్తారు. దశల వారీ నిషేధమంటూ మద్యం రేట్లు పెంచి లక్షల కోట్లు దోపిడీ చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లేక అల్లాడుతున్నారని చెప్పారు. గురువారం కడప నగరం 36, 37, 50 డివిజన్లలో ఎన్నికల ప్రచారం నిర్వహించి రోడ్‌షో నిర్వహించారు. సాయిపేట ఆటోస్టాండు సమీపంలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. అలాగే 14వ డివిజన్ తేజ స్కూలు సమీపంలో ఎన్నికల ప్రచారం నిర్వహించి రోడ్‌షో చేసి కార్నర్ మీటింగ్ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ దశల వారీ మద్యనిషేధమని 2019 ఎన్నికల ముందు చెప్పి 2024 నాటికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి లక్షల కోట్లు దోపిడీ చేశారన్నారు. సీఅడక్షన్ సెంటర్ల పేరుతో హడావుడి తప్ప ఒక్కటి కూడా ఇంత వరకు ప్రారంభించలేదని తెలిపారు. మద్యం షాపుల్లో నగదు లావాదేవీ మాత్రమే జరుపుతూ వేల కోట్లు ప్రజాధనం పక్కదారి పట్టించారన్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాల నుంచి మద్యం బ్లాక్‌మార్కెట్ అమ్మకాలు జరుగుతన్నాయని చెప్పారు. బ్లాక్‌మార్కెట్ డబ్బు లక్షల కోట్లుతాడేపల్లి ప్యాలెస్‌కు చేరుతుందనేది నిజం కాదా అని ప్రశ్నించారు. నాశిరకం మద్యంతో 35 లక్షల మంది అమాయకులు ఆసుపత్రిపాలయ్యారన్నారు. 30 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. 2019 నుండి రాష్ట్రంలో లివర్ ఫోరోసిస్ వ్యాధి బాధితులు పెరగడానికి జగన్‌రెడ్డి కల్తీ మద్యం కారణమన్నారు. ఇదంతా ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ఛైర్మన్ వాసుదేవరెడ్డి కనుసన్నల్లోనే రాష్ట్రంలో మద్యంమాఫియా అరాచకం నడుస్తుందన్నారు. టీడీపీ పాలనలో మద్యం అమ్మకాలు 72 వేల కోట్లు ఉంటే జగన్‌రెడ్డి పాలనలో 1.31 లక్షల కోట్లు చేరిందన్నారు. బ్లాక్ మార్కెట్ ద్వారా తాడేపల్లి ప్యాలెస్ కొట్టేసింది లక్ష కోట్లు అని ఆరోపించారు. దశల వారీ మద్యం నిషేధం అన్నప్పుడు రాష్ట్రంలో ఎక్సైజ్, వ్యాట్ ఆదాయం క్రమంగా తగ్గించాల్సింది పోయి పెరగడం ఏ విధమైన నిషేధమని ప్రశ్నించారు. ప్రభుత్వానికి పన్ను లరూపంలో 2019-20లో 17300 కోట్లు, 2020-21లో 21,500 కోట్లు, 2021-22లో 26700 కోట్లు, 2022-23లో 30600 కోట్లు, 2023,24లో 38వేల కోట్లు మొత్తం 1.31 లక్షల కోట్లుకు పైగానే అధికారికంగా మద్యం అమ్మకాలు జరిగాయన్నారు. అనధికారికంగా బ్లాక్‌మార్కెట్‌లో మరో లక్ష కోట్లు విలువైన మద్యం అమ్మకాలు చేసి ఆ మొత్తాన్ని తాడేపల్లి ప్యాలెస్ దోచుకుందని చెప్పారు. అంతేకాకుండా నిబంధనలకు విరుద్ధంగా మద్యం ఆదాయాన్ని బ్యాంకులకు తాకట్టు పెట్టి బేవరేజెస్ కార్పొరేషన్ ద్వారా 20 సంవత్సరాల్లో తిరిగి చెల్లించే విధంగా 40వేల కోట్లు అప్పు తెచ్చారన్నారు. మద్యం నిషేధం హామీపై మాట తప్పి మడమ తిప్పి పేదలకు నమ్మక ద్రోహం చేశారన్నారు. కల్తీ మద్యం, అధిక ధరల కారణంగా నాటుసారా అమ్మకాలు జోరందుకున్నాయని అన్నారు. 4 లక్షల బెల్టు మొబైల్ షాపులు నడుపుతున్నారని ఆరోపించారు. దీనంతటికీ మార్పు రావాలంటే టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలని కోరారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రంలో దోపిడీ విధ్వంసం తప్ప అభివృద్ధి జరగలేదన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా అరాచకాలు, దోపిడీలు జరిగాయన్నారు. ప్రజలు ప్రశాంతంగా బతకాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థులను గెలిపించి చంద్రబాబును సీఎం చేసుకోవలసిన ఆవశ్యకత ఉందన్నారు. రాష్టంలో 16 లక్షల మంది గ్రాడ్యుయేట్లు, పోస్టుగ్రాడ్యుయేట్లకు చంద్రబాబు ఆధ్వర్యంలో ఫీరీయింబర్స్‌మెంటు అందించడం జరిగిందన్నారు. ప్రస్తుత జగన్ ప్రభుత్వం కేవలం 8లక్షల మందికి ఫీరీయింబర్స్‌మఎంటు ఇవ్వడానికి నానా తంటాలు పడుతున్నారన్నారు. 2014-19 మధ్య కాలంలో టీడీపీ అధికారంలో ఉందని ఆ సమయంలో 4వేల మందికి పైగా విద్యార్థులను అంబేద్కర్ విదేశీ విద్య ద్వారా విదేశీ చదువులను అందించినట్లు తెలిపారు. దీంతో పేద మధ్య తరగతి విద్యార్థులు ఎంతో ఆనందించారని అన్నారు. వారి తల్లిదండ్రులుకూడా టీడీపీ ప్రభుత్వానికి ధన్యవాదలు తెలిపారన్నారు. జగన్ సీఎం అయినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒకరికి కూడా విదేశీ విద్య అందించలేకపోవడం మన దౌర్భాగ్యమన్నారు. రాష్ట్రంలో చదువు ఊర్తి చేసిన విద్యార్థులు ఉద్యోగాలు లేక ఈ ఐదేళ్ల పాలనలో ఎంతో మంది దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. దీంతో వారి కుటుంబాలకు భారమై తల్లిదండ్రులపై ఆధారపడి జీవనం వెళ్లదీయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వారంతా వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని అన్నారు. చంద్రబాబును మూడు సమ్మిట్‌ల ద్వారా 5.13 లక్షల ఉద్యోగాలు కల్పించడంలో కీలకపాత్రపోషించారన్నారు. కానీ జగన్ ప్రభుత్వంలో ఒక్క బిజినెస్ సమ్మిట్ ద్వారా కేవలం 9150 మందికి మాత్రమే ఉద్యోగాలు ఇవ్వగలిగారని అన్నారు. చంద్రబాబు ఐదుల క్షల వరకు వడ్డీ లేని డ్వాక్రా రుణాలు ఇస్తే జగన్‌రెడ్డి ప్రభుత్వం కేవలం 3లక్షలకు అది కుదించినట్లు తెలిపారు. అంగన్వాడీ జీతాలను చంద్రబాబు 6300 కు పెంచారని, జగన్‌రెడ్డి కేవలం దానిపై వెయ్యి మాత్రమే పెంచారని అన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ కార్పొరేషన్ రుణాలను చంద్రబాబు 4 లక్షలక వరకు అందిస్తే జగన్‌రెడ్డి రుణాలు ఇవ్వకుడా పూర్తిగా నిలిపివేశారని అన్నారు. అలాగే అన్న క్యాంటీన్ల ద్వారా సుమారు 8.95 కోట్ల మందికి భోజనం అందించి ఆకలి తీర్చిన ఘనత చంద్రబాబు ప్రభుత్వానిదే ఇక దక్కిందన్నారు. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అన్న క్యాంటిన్లను నిర్లక్ష్యంగా మూసివేశారని ఆవేదన వ్యక్తం చేశారు.



34వ డివిజనులో టీడీపీలో చేరిన ముస్లిం మైనార్టీలు

32వ డివిజనులో చేరికలు

కడప నగరం 32వ డివిజన్‌లో గురువారం అధిక సంఖ్యలో స్థానికులు టీడీపీలో చేరారు. వారికి కడప టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి టీడీపీ కండువావేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అమీర్ బాబు, 14వ డివిజనకు సంబంధించి ఉదయ్‌కుమార్, దివాకర్, నరేష్, ముజీబ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. అలాగే 37వ డివిజన్ యువరాజ్, పవన్ మన్సూర్, జిలానీ బాషాతోపాటు పలువురు పాల్గొన్నారు. అలాగే 30వ డివిజనులో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దుర్గాప్రసాద్, జనసేన జిల్లా కన్వీనరు సుంకర శ్రీనివాస్ పాల్గొన్నారు.

34డివిజన్‌లో...

34వ డివిజన్‌లో మైనార్టీ యువత టీడీపీలో చేరింది. వారికి మాధవీరెడ్డి టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బిట్ట శ్రీధర్, జావీద్, సబ్రిజ్, షకీల్, ఫిరోజ్, నవీద్, యూసిఫ్, సాదిక్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ షేక్‌హుసేన్ బామ్మర్ది టీడీపీలో చేరిక

కడప నగరం ద్వారకానగర్ ఎమ్మెల్యే అభ్యర్థి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ షేక్‌హుసేన్ బామ్మర్ది మహబూబ్ బాషా తన మిత్రబృందం టీడీపీలో చేరారు. వారికి పొలిట్ బ్యూరోసభులు శ్రీనివఆసరెడ్డి టీడీపీ కండువా వేసిపార్టీలోకి ఆహ్వానించారు.

మాజీ ఎమ్మెల్సీ షేక్‌హుసేన్ బామ్మర్ది టీడీపీలో చేరిక

కడప నగరం ద్వారకానగర్ ఎమ్మెల్యే అభ్యర్థి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ షేక్‌హుసేన్ బామ్మర్ది మహబూబ్ బాషా తన మిత్రబృందం టీడీపీలో చేరారు. వారికి పొలిట్ బ్యూరోసభులు శ్రీనివాసరెడ్డి టీడీపీ కండువా వేసిపార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సయ్యద్ అఫ్రోజ్, ఫైరోజ్ ఖాన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

సైకిలు గుర్తుకు ఓటు వేయండి



సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తున్న ఖాదర్‌బాషా

కమలాపురం రూరల్, మే 9 :సైకిలు గుర్తుకు ఓటు వేసి కమలాపురం ఎమ్మెల్యే అభ్యర్థిని అధిక మెజార్టీతో గెలిపించాలని ముస్లిం మైనార్టీ కడప పార్లమెంటు అధ్యక్షుడు ఖాదర్‌బాషా పిలుపునిచ్చారు. గురువారం నగర పంచాయతీ పరిధిలోని 16వ వార్డులో టీడీపీ అభ్యర్థి పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డికి ఓటు వేసి గెలిపించాలని ఈవీఎంలు చూపిస్తూ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలలో పుత్తా చైతన్యరెడ్డి సైకిలు గుర్తుకు ఈవీఓంలో 1 నెంబరు ఉంటుందని, కావున పోలింగ్ కేంద్రంలో 1వ నెంబరులో సైకిలు గుర్తుకు ఓటు ఎలా వేయాలో డెమో చేసి చూపించారు. అనంతరం పుత్తా ఆదేశాల మేరకు ఆయా బూత్‌లలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. దాదిరామయ్య, మల్లిఖార్జునశెట్టి, కామిశెట్టి వెంకటరమణ, శ్రీనివాసరెడ్డి, రామసుబ్బారెడ్డి, కౌన్సిలరు అజ్మతుల్లా, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నతస్థానం

జమ్మలమడుగు, మే 9: విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉన్నతస్థానంలో నిలుస్తారని ఏపీ పద్మశాలీయ సంఘం రాయలసీమ ఇన్‌ఛార్జి సిలివేరు దశరథ రామయ్య, కడపజిల్లా పద్మశాలీయ సంఘం అధ్యక్షుడు చింతలపల్లె రుద్ర మహేశ్వరుడు సూచించారు. గురువారం జమ్మలమడుగు పట్టణంలోని సరస్వతి విద్యామందిరంలో పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో పరిసర ప్రాంతాల్లోని 10వ తరగతిలో ఉన్నత మార్కులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. పద్మశాలీయ సంఘం ఉపాధ్యక్షులు సిలివేరి వెంకటేశ్వర్లు, మేడికుర్తి ఆదినారాయణ, చింతలపల్లె గురునాగేశ్వరరావు, ఆరవేటి తిరువెంగళప్ప పాల్గొన్నారు.

మహిళకు గాయాలు

బద్వేలు, మే 9 : బద్వేలు ఆర్టీసీ బస్టాండులో గోపవరం మండలం రాచాయపేటకు చెందిన జయమ్మ అనే మహిళకు గాయాలయ్యాయి. గురువారం మధ్యాహ్నం బస్సుకోసం ఆర్టీసీ బస్టాండులో జయమ్మ వేచి ఉండగా బస్టాండు పైకప్పు పెచ్చులూడి ఆమె తలపై పడడంతో ఆమెకు గాయాలయ్యాయి. వెంటనే ఆర్టీసీ సిబ్బంది ఆమెను స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి వైద్య చికిత్స చేయించారు.

నిఘా నీడలో ఓటింగ్

● పోలింగ్ బూత్‌లలో సీసీ కెమెరాల ఏర్పాటు



పోలింగ్ బూత్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

పులివెందుల టౌన్, మే 9: ఎన్నడూ లేని విధంగా ఈ ఎన్నికల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా ఈసీ ఆదేశాలు ఇచ్చింది. దీంతో గ్రామాలు, పట్టణాలలో ఉన్న పోలింగ్ బూత్‌లలో బుధవారం నుంచి సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇటీవల తెలంగాణలో ఎన్నికల సందర్భంగా తీసుకున్న నిర్ణయం ప్రకారం ఈసీ ప్రతి పోలింగ్ బూత్‌లలో రెండేసి కెమెరాలు ఏర్పాటు చేయనుంది. ఒక కెమెరాను బూత్ బయట, మరో కెమెరాను బూత్ లోపల అమర్చుతున్నారు. కెమెరాలోనే మెమోరీ, నెట్ సౌకర్యంతో పాటు రాత్రిళ్లు పనిచేసేలా లైట్లు కూడా అమర్చారు. పులివెందుల మండలంలో 73 పోలింగ్ కేంద్రాలు ఉన్నా యి. నియోజకవర్గ వ్యాప్తంగా 301 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటితో పాటు సమస్యాత్మకంగా 181 గుర్తించారు. 120 వీడియో రికార్డులు, వీడియో కెమెరాలను ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు.

బ్యాలెట్ నమూనాతో టీడీపీ నాయకుల ఇంటింటి ప్రచారం



గురిజాల ఎస్సీ కాలనీలో ప్రచారం చేస్తున్న మురళీమోహన్ యాదవ్

సింహాద్రిపురం, మే 9: సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఓటరు సైకిలు గుర్తుకు ఓటు వేసి టీడీపీని తెలిపించాలని టీడీపీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు మురళీమోహన్‌యాదవ్ ప్రజలను కోరారు. గురువారం మండలంలోని గురిజాల గ్రామం ఎస్సీ కాలనీలో బ్యాలెట్ నమూనాతో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పులివెందుల టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి(బీటెక్‌రవి), కడప టీడీపీ ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డిల సైకిలు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మురళీమోహన్‌యాదవ్ ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు శివ, అంకన్న, ఖుషి, రమణ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం



బ్రోచరును విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ సలీంబాషా

కడప (ఎర్రముక్కపల్లె), మే 9 : కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలలో డిగ్రీ అడ్మిషన్లకుసంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ సలీంబాషా తెలిపారు. గురువారం కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలో అడ్మిషన్లకు సంబంధించిన బ్రోచరును విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో 50 సంవత్సరాలకు పైగా చరిత్ర కలిగిన ఏకైక తొలి ప్రభుత్వం మహిళా కళాశాల అని తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన మహిళలందరికీ డిగ్రీలో ప్రవేశం పొందడానికి అన్ని విధాలా అనుకూలమైన కళాశాల అన్నారు. మారుమూల ప్రాంతాల నుండి వచ్చే గ్రామీణ విద్యార్థినిలకు ఎంతో అనుకూలంగా కళాశాల ఉంటుందని తెలిపారు.

టీడీపీ గెలిస్తే కడప అభివృద్ధికి బాటలు

● పెన్షనర్లు, ఉద్యోగులు అందరికీ 1వతేదీనే జీతాలు... ● కడప పార్లమెంటు అభ్యర్థి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి



ఆర్ట్స్‌కాలేజీలో వాకర్స్‌తో మమేకమైన భూపేష్‌రెడ్డి, పక్కన విష్ణువర్ధన్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి



విజయదుర్గా ఆలయంలో దుర్గాప్రసాద్ నుంచి జ్ఞాపిక అందుకుంటున్న భూపేష్‌రెడ్డి

(కడప - ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపిస్తే కడప అభివృద్ధికి బాట పడుతుందని టీడీపీ అభ్యర్థి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి అన్నారు. గురువారం కడప నగరంలోని ఆర్ట్స్ కాలేజీలో వాకర్స్‌తో కలిసి వాకింగ్ చేస్తూ ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి వాకర్స్‌తో మమేకమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్ మన జిల్లావాసి అని గెలిపించాం, అయితే జిల్లా అభివృద్ధికి పాటుపడడంలేదు. జిల్లాలో నిరుద్యోగులు ఉపాధి లేక పొరుగు రాష్ట్రాలకు, విదేశాలకు వలస బాట పడుతున్నారన్నారు. కడపలో స్టీలు ఫ్యాక్టరీ పూర్తి చేసుంటే ప్రత్యక్షంగా పరోక్షంగా 50వేల మందికి ఉద్యోగాలు వచ్చేన్నారు. అయితే జగన్ పట్టించుకోలేదన్నారు. చంద్రబాబు హయాంలో అనంతపురం జిల్లాలో కియా పరిశ్రమకు భూమిపూజ జరిగిందని, అలాగే ఆయన హయాంలోనే ఉత్పత్తి కూడా జరిగిందన్నారు. ఆర్థిక కష్టాలున్నా చంద్రబాబు 43 శాతం జీవోలకు ఫిట్‌మెట్ ఇచ్చారన్నారు. క్రమం తప్పకుండా వేతనాలు ఇచ్చారు. అయితే ఇప్పుడు ప్ర భుత్వ ఉద్యోగులన్నా పెన్షనర్ల అన్నా జగన్‌కు మహా చిరాకు అన్నారు. ఉన్నత విద్యావంతులు, మేధావులంతా ఈ సారి టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి ప్రజలను కోరారు.

హజ్ యాత్రికులకు ఉచిత వ్యాక్సినేషన్



హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్ వేస్తున్న డాక్టర్లు

కడప(కలెక్టరేట్), మే 9: హజ్ యాత్రకు వెళ్లేవారికి ఉచిత వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించినట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. గురువారం నగరంలోని యూపీహెచ్‌సీ రాధాకృష్ణ నగర్‌లో హజ్‌యాత్రకు వెళ్లే 200 మందికి పరీక్షలు నిర్వహించి వ్యాక్సినేషన్ వేశామన్నారు. ఈ కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వర కుమార్, అర్బన్ నోడల్ అధికారి ఉబేదుల్లా, మెడికల్ అధికారి సుమధుర,ఖాజా, కుమారి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్‌లు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చక్రాయపేట, మే 9: మండలంలోని మహదేవపల్లె, చక్రాయపేట, కె.రాజుపల్లె, కె.ఎర్రగుడి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలలో శుక్రవారం ఉదయం 8.15 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ ఏఈఈ ప్రవీణ్‌కుమార్‌యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 33కెవి చక్రాయపేట ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా ఈ అంతరాయం ఉంటటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

హ్యాండ్లూమ్ టెక్నాలజీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి(కలెక్టరేట్), మే9: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (వెంటగిరి తిరుపతి జిల్లా) లో డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్ అధికారి శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండూమ్ టెక్నాలజీ వెంకటగిరి తిరుపతి జిల్లాలో 53 సీట్లకు, తమిళనాడులోని సేలంలో 12సీట్లకు కర్ణాటకలోని గదగ్‌లో 3 సీట్లకు మూడు సంవత్సరాల కోర్సులో ప్రవేశానికి ఈ నెల 1వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు పదవ తరగతి లేదా తత్సమానమైన పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉండాలి. వయస్సు జూల్ 1 నాటికి బీసీ లేదా జనరల్ కేటగిరి వారు 15 నుంచి 23 ఏళ్లు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వారికి 25 ఏళ్ల మించకుండా ఉండాలి. ఇంటర్మీడియట్ ఎంపీసీ, ఇంటర్మీడియట్ టెక్స్‌టైల్స్ ఐటీఐ కోర్సుల్లో ఏదైనా ఒకదానిలో ఉత్తీర్ణులైన వారికి నేరుగా డీహెచ్‌టీటీ కోర్సులో రెండవ సంవత్సరానికి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 9399936872, 9866169908, 9010243054కు సంప్రదించాలన్నారు.

చందన అలంకారంలో హరిహరాదులు





చందనోత్సవంలో చెన్నకేశవుడు.. నదీ స్నానాల కోసం ఏటిలో పిల్లరు ఏర్పాటు చేసిన దృశ్యం





పుష్పగిరి ఆలయంలో నెలకొన్న శ్రీచక్ర సమేత కామాక్షి మూలవిరాట్

వల్లూరు, మే 9 : పుష్పగిరిలో జరుగుతున్న కామాక్షి వైద్యనాథేశ్వర శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదోరోజు గురువారం హరిహరాదుల చందనోత్సవాన్ని వేద పండితులు ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా వైద్యనాథేశ్వర స్వామి ఆలయంలో అర్చకుడు రాజేశ్ ఆధ్వర్యంలో అభిషేకాలను, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. దేవీ ఖడ్గమాలతో కామాక్షి అమ్మవారిని అర్చించారు. అలాగే పరమేశ్వరునికి ప్రీతికరమైన రుద్రహోమాదులను అనంతరం అమ్మవారికి ఖడ్గమాలతో హోమాలు చేశారు. అభిషేకం అనంతరం చందన అలంకారం తో శివ పార్వతులను అలంకరించారు. కొండపైన లక్ష్మీచెన్నకేశవస్వామికి సుప్రభాత సేవ అనంతరం తిరుమంజన స్నపనం నిర్వహించారు. స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. నదిలో నీరు లేకపోవడంతో నదిలో పిల్లరు ఏర్పాటు చేసి పుణ్యస్నానం ఆచరించారు.

అలాగే సాయంత్రం మయూర వాహనంపై వైద్యనాథేశ్వరుడు, హనుమత్‌వాహనంపై చెన్నకేశవుడి గ్రామోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు.

నేడు అక్ష తదియ

అక్ష తదియ సందర్భంగా భక్తులు మన జిల్లా నుంచే కాక ఇతర జిల్లాల నుంచి కూడా శివకేశవులను దర్శించుకుంటారు. పూలంగి సేవ అనంతరం చెన్నకేశవుడు గరుడ వాహనంపై భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తారు.

పసుపుమయమైన వల్లూరు




వల్లూరులో సభనుద్దేశించి మాట్లాడుతున్న పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, పెండ్లిమర్రిలో పార్టీలో చేరిన వారితో పుత్తా నరసింహారెడ్డి

- ప్రతి ఎకరాకు సాగునీరందిస్తా
- కమలాపురం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి

వల్లూరు, మే 9: వల్లూరు మండల కేంద్రం పసుపుమయమైంది. గురువారం నిర్వహించిన టీడీపీ ఎన్నికల ప్రచార సభ విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ ఉపాధ్యక్షుడు, కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి మాట్లాడుతూ వైసీపీ నాయకులు ఎక్కడెక్కడ భూ ములు కబ్జా చేశారో వాటన్నింటినీ టీడీపీ ప్రభుత్వం రాగానే కక్కిస్తామన్నారు. ఈ సందర్భంగా గణేశ్‌పురం బస్టాండు వద్ద ముందుగా గజమాల వేసి స్థానిక నాయకులు వారిని వల్లూరు గాంధీబొమ్మ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీ సెంటరు వద్ద బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తామన్నారు. చెరువులకు అనుసంధానం చేసి పూర్తి స్థాయిలో నీరందిస్తామని హామీ ఇచ్చారు. పుత్తా చైతన్యరెడ్డి మాట్లాడుతూ తాను రైతు బిడ్డనే అని, రైతుల కష్టాలు బాగా తెలుసన్నారు. హంద్రీ-నీవా ద్వారా రైతులకు కావాల్సిన సాగునీరు అందించడమే లక్ష్యమన్నారు. ముఖ్యంగా ప్రతి గ్రామంలో ప్రతి ఎకరా పండించేందుకు తీవ్రంగా కృషి చేస్తానన్నారు. తాను లోకల్ అని, ఎప్పుడు పిలిచినా ఏ అవసరం ఉన్నా మీ ఎదుటే ఉంటానన్నారు. ప్రజలకు సేవ చేయడమే తన బాధ్యత అన్నారు. వైసీపీ ప్రభుత్వ అరాచకాలకు స్వస్తి పలకాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు ఇచ్చిన సంక్షేమ పథకాలతో పాటు అదనంగా ఇప్పుడు కూడా ప్రతి ఇంటికీ గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వడంతో పాటు ఆర్టీసీ బస్సుల్లో మహిళ లకు ఉచిత ప్రయాణం, ఆడబిడ్డలకు నెలనెలా 1500 ఇవ్వడం ఇలా అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. వల్లూరు అభివృద్ధికి తోడ్పాడతామన్నారు. అంతకు ముందు పుత్తా మాట్లాడుతూ ఈ మండలంలో కొంత మంది వైసీపీ నాయకులు భూబ్జాలు చేశారన్నారు. గోటూరు వద్ద భూములు కబ్జా చేస్తే వాటిని కోర్టు ద్వారా నిలిపివేసి మైనార్టీ ద్వారా హక్కుకు భంగం వాటిల్లకుండా తాము కృషి చేశామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి చైతన్యరెడ్డిని, ఎంపీ అభ్యర్థి భూపేష్‌ను అఖండ మెజార్టీతో ఎగెలిపించాలని కోరారు. టీడీపీ ప్రభుత్వం రాగానే ప్రజలకు ఏమైతే హామీలు ఇచ్చామో వాటిని పూర్తి స్థాయిలో పక్కా ప్రణాళికలతో అందరూ బాగుండేలా పాటుపడతామని హామీ ఇచ్చారు. తాను వల్లూరు మండలవాసినని, తాను ఎప్పుడూ ప్రజల మంచినే కోరతామన్నారు. ప్రజలకు ఏమి ఇబ్బంది వచ్చినా అర్ధరాత్రి అయినా తమకు సమాచారం ఇస్తే వారి చెంత చేరి సాయం అందిస్తానన్నారు. జనసేన ఇన్‌చార్జ్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాసంక్షేమం కొనసాగాలన్నా, ప్రజలు ఏపీ అభివృద్ధి చూడాలన్నా, అమరావతి రాజధాని కావాలన్నా ఒక్క కూటమితోనే సాధ్యమన్నారు. అందుకే కూటమి అభ్యర్థులైన క్రిష్ణచైతన్యరెడ్డి, భూపష్‌రెడ్డిలను గెలిపించాలన్నారు. వల్లూరు మండలంలో వైసీసీ నాయకులు భూ కబ్జాలు, దుస్సాహసాలకు పాల్పడ్డారని, తమ ప్రభుత్వం రాగానే వాటన్నింటికీ సంబంధించి పక్కా ఆధారాలతో వెనక్కి తీసుకుంటామన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు లింగారెడ్డి మాట్లాడుతూ యువత భవిష్యత్తు కోసం రాష్ట్ర ప్రయోజనాల కోసం చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. రాబోవు ఎన్నికల్లో చైతన్యరెడ్డి, భూపేష్‌రెడ్డికి ఓట్లు వేయాలని కోరారు. సమావేశంలో యువ నాయకుడు పుత్తా లక్ష్మీరెడ్డి, పుత్తా సాయినరసింహారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, ఇందిరెడ్డి తిమ్మారెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, రవీంద్రనాథరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, రాఘవరెడ్డి, శివారెడ్డి, సుబ్బారెడ్డి, సదాశివరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, రమణరెడ్డి, దామోదర్, సురేష్, చిట్టిబాబు, వెంకటసుబ్బయ్య, సునీల్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, శ్రీధర్, ముస్లిం మైనార్టీ నాయకులు, టీడీపీ సర్పంచ్ టీడీపీ అభిమానులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అంతకుముందు వల్లూరు బస్టాండు వద్దకు రాగానే గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం ఎద్దుల బండితో సభావేదిక వద్దకు వచ్చారు.

పెండ్లిమర్రి: మండలంలోని ఇసుకపల్లె పంచాయతీలో గురువారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి సమక్షంలో 20 కుటుంబాలవారు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వారిని కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన పుత్తా నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తానని, కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తను పార్టీ మరువదన్నారు. అనంతరం పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని నమ్మి పార్టీలో చేరామన్నారు. కమలాపురం ఎమ్మెల్యే అభ్యర్థి పుత్తా కృష్ణ చైతన్యరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు మల్లికార్జునరెడ్డి, బాబా ఫక్రుద్దీన్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రి పంచాయతీలో...

మండలంలోని పెండ్లిమర్రి పంచాయతీలో టీడీపీ మండల అధ్యక్షుడు గంగిరెడ్డి, మహిళా నాయకురాలు అంజలి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ నాగమల్లారెడ్డి, రఘునాథరెడ్డి, రామగంగిరెడ్డి, బయన్న, లక్ష్మిరెడ్డి, అయ్యవారురెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చెన్నూరులో ప్రచారం నిర్వహిస్తున్న అమీర్‌బాబు

చెన్నూరు: రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమం కోసం పాటుపడేది టీడీపీనే అని ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అమీర్‌బాబు అన్నారు. గురువారం చెన్నూరు మైనార్టీ కాలనీలో ఇంటింటా తిరిగి పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డిని గెలిపించాలని కోరారు. మైనార్టీ నాయకులు బర్కతుల్లా, జిల్లా మైనార్టీ నేత షబ్బీర్ హుసేన్, మంజూరు అహ్మద్, ఖాజాతో పాటు రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లిఖార్జునరెడ్డి, గంధం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

మండలంలోని చిన్నమాచుపల్లె, చెన్నూరు తూర్పు హరిజనవాడకు చెందిన పలువురు గురువారం మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, చిన్నమాచుపల్లె గ్రామ కమిటీ అధ్యక్షుడు మాకం భరత్‌ల ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు.

దౌలతాపురంలో ర్యాలీ

మండలంలోని దౌలతాపురంలో కమలాపురం టీడీపీ అభ్యర్థిని గెలిపించాలి, సైకిలు గుర్తుకు ఓటు వేయాలంటూ సీనియర్ టీడీపీ నేతలు లేవాకు శివారెడ్డి, లేవాకు ప్రతాప్‌రెడ్డి, ఓ.విజయభాస్కరరెడ్డి, గురుమహేశ్వర్‌ల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కొండపేట గ్రామంలో యువనేత సంజీవ్ పవన్ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్ మన్యం మోహన్‌రెడ్డి, జిల్లా రైతు కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, సునీల్, శివ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. చెన్నూరు లక్ష్మినగర్, సరస్వతినగర్, శ్రీరామ్‌నగర్‌లలో టీడీపీ నేతలు జడ లక్ష్మీనారాయణ, అతికారి విశ్వం, సుంకేసుల వెంకటసుబ్బయ్య, కేశా శ్రీనివాసులు, పసుపులేటి శివశంకర్‌ల ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యం

- చక్కెర కర్మాగారం స్థానంలో నూతన పరిశ్రమ తెస్తా
- హజ్‌హౌస్‌ను వినియోగంలోకి తెస్తా
- సర్వరాయసాగర్‌ను రైతులకు అందుబాటులోకి తెస్తాం
- పుష్పగిరి వద్ద వంతెన నిర్మిస్తాం
- కమలాపురం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

చెన్నూరు, మే 9: "నియోజకవర్గంలోని యువత ఐదేళ్లుగా ఎలాంటి ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. అవకాశాలు ఉన్న కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ పార్కులో సైతం కేవలం చిన్న చిన్న పరిశ్రమలు తప్ప పెద్ద పరిశ్రమలు లేవు. నియోజక వర్గంలో మంచి విద్యావంతులు ఉన్నారు. వారి విద్యకు తగినట్లుగా ఉద్యోగవకాశాలు ఉంటే ఇతర ప్రాంతాలకు పోయే అవసరం ఉండదు. ఇక్కడే మంచి అవకాశాలు పొంది ఈ ప్రాంత అభివృద్ధికి కూడా సహకరించే అవకాశం ఉంది. పైగా సమీపంలోని చెక్కర కర్మాగారాన్ని మూసివేసి స్క్రాబ్ కింద అమ్మివేసి పరిశ్రమనే లేకుండా చేసిన ఘనత ఇక్కడి పాలకులదే. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల్లో యువత తమ భవితకు సరైన రథసారధి అవసరమని ఎదురుచూస్తున్నారు. యువతకు మంచి భవిష్యత్తు కల్పించి వారితో పాటు వారి కుటుంబాలను ఉన్నత స్థితికి తీసుకురావాలన్నదే లక్ష్యం. ప్రజలు కూడా సహకరిస్తున్నారు. తప్పకుండా విజయం సాధించి నియోజకవర్గాన్ని అభివృద్ధిపథంలో తీసుకురావడానికి నా వంతుగా గట్టి ప్రయత్రం చేస్తాను" అని కమలాపురం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. తొలిసారి ఆయన ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న నేపథ్యంలో ఆంధ్రజ్యోతి జరిపిన ఇంటర్వ్యూ.

ప్రశ్న: నియోజకవర్గానికి ఎలాంటి పరిశ్రమలు తెస్తారు ?

జవాబు: ఈ ప్రాంతంలో చదువుకునే యువత ఎక్కువగా ఉన్నారు. కొప్పర్తి మెగా ఇండస్ట్రియల్ పార్కులో 7వేల ఎకరాల భూమి ఉంది. ఇప్పుడేవో చిన్న చిన్న పరిశ్రమలు ఉన్నా వాటి వల్ల ప్రయోజనం ఏమంత లేదు. యువత చదువుకు తగినట్లుగా పెద్దపరిశ్రమలు అవసరం. వీటి ద్వారా ఇక్కడ తయారైన ఏ వస్తువైనా ఇతర ప్రాంతాలకు ఎగుమతి జరిగితే మంచి లాభార్జన ఉంటుంది. తద్వారా ఇంకొందరికి ఉపాధి దొరికే అవకాశం ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో నా ఆశయం, లక్ష్యం పెద్ద పరిశ్రమల ఏర్పాటే. ప్రొడక్షన్ కోసం ఫర్నీచర్, రా మెటీరియల్ తీసుకువచ్చి ఇక్కడే ఫర్నీచర్ తయారు చేయడం జరిగితే అది కూడా ఒక పెద్దపరిశ్రమే. ఎలక్ట్రానిక్, వస్తువుల తయారీ ఇప్పట్లో ఎంతో అవసరం. ఇదొక తిరుపతి శ్రీసిటీగా అభివృద్ధి చెందాలన్నదే నా ఆశయం.

ప్రశ్న: చక్కెర కర్మాగారం స్థానంలో ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేస్తారు.

జవాబు: విలువైన చక్కెర కర్మాగారాన్ని స్క్రాబ్ కింద అమ్మడం దారుణం. అదేచోట పరిశ్రమ ఏర్పాటైతే గతం కన్నా మిన్నగా యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ఇప్పటికే ఎంతో మంది యువత ఈ స్థలాన్ని ఖాళీగా ఉంచడకుండా పరిశ్రమలు ఏర్పాటు చేయాలని చెబుతున్నారు. వారి కోరిక మేరకు గతం కన్నా మించి పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నదే లక్ష్యం. ఆ దిశగా ఆలోచన చేస్తున్నాం. తప్పకుండా మంచి పరిశ్రమలు ఏర్పాటు అవుతాయి. విస్తారంగా ఉద్యోగ, ఉపాధినిచ్చే చక్కటి ప్రణాళికను తయారు చేశాం.

ప్రశ్న: హజ్‌హౌస్‌ను నిర్లక్ష్యం చేసి ముస్లింలను ఇబ్బంది పెట్టారంటారా ?

జవాబు: ఒక పవిత్రమైన లక్ష్యంతో హజ్‌హౌస్ నిర్మించారు. కేవలం 5 నుంచి 10 శాతం పనులు మాత్రమే పెండింగులో ఉన్నాయి. ఈ పాలకులు నిధులు ఇవ్వకుండా ముస్లిం మైనార్టీల మనోభావాలు దెబ్బతీసే విధంగా నడుచుకున్నారు. సమీపంలో ఉప ముఖ్యమంత్రి ఉన్నప్పటికీ హజ్‌హౌస్ పట్ల నిర్లక్ష్యమే. రూ.ఐదు కోట్ల నిధులతో టెండరు నిర్వహిస్తామని చెప్పినా ఆ దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. 2019 ఫిబ్రవరిలో హజ్‌హౌస్‌ను అప్పటి సీఎం చంద్రబాబు ప్రారంభిస్తే ఇప్పుడున్న పాలకులు మిగిలిన చిన్న పనులు కూడా పూర్తి చేయక నిర్లక్ష్యం వహించి హజ్‌యాత్రకు మన ప్రాంతం నుంచి అవకాశం లేకుండా చేశారు. ఈ హజ్‌హౌస్ పూర్తయి ఉంటే అటు హజ్‌యాత్ర కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఇక్కడ యువతకు శిక్షణ కార్యక్రమాలు, మైనార్టీలకు సంబంధించి పలు రకాల కార్యాలయాలు వచ్చి ఉండేవి. టీడీపీ అధికారంలోకి రాగానే మొట్టమొదటగా హజ్‌హౌస్‌పై దృష్టి పెట్టి పూర్తి చేయించి వినియోగంలోకి తెస్తా.

ప్రశ్న: ఇసుక, గ్రావెల్, మట్టి అక్రమ రవాణాపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు ?

జవాబు: ఇవన్నీ ప్రకృతి వనరులు. ముఖ్యంగా ఇసుకను ఇష్టానుసారంగా తరలించడం తగదు. ప్రజల అవసరాలకు మాత్రమే వినియోగించాలి. టీడీపీ ప్రభుత్వం ఉచితంగా ఇసుక అందిస్తే ఇప్పుడు ఏకంగా జేసీబీలు పెట్టి ఇష్టానుసారంగా తవ్వి కోట్ల రూపాయలు పాలకులు సొమ్ము చేసుకున్నారు. గుట్టలు గుల్ల చేసి గ్రావెల్‌ను, మట్టిని రేయింబవళ్లు తరలిస్తున్నారు. పెండ్లిమర్రి మండలంలో సహజవనరులను కొల్లగొట్టారు. అధికారం ఇస్తే ఆస్తులు సంపాదించుకోవడమేనా..? అందుకే సహజ వనరులను పరిరక్షించడంతో పాటు రాబోవు ప్రభుత్వానికి ఆదాయ వనరులు వనగూరేలా చర్యలు తీసుకుంటాం.



ప్రశ్న: భూ కబ్జాలపై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

జవాబు: నియోజకవర్గ వ్యాప్తంగా వేలాది ఎకరాలను ప్రస్తుత పాలకులు కబ్జా చేశారు. ల్యాండ్ మాఫియా తయారైంది. ఎక్కడ ప్రభుత్వ భూమి, చుక్కల భూమి కనిపించినా వాటిని కబ్జా చేయడం మామూలైంది. చివరికి దేవాలయ భూములు, వక్ఫ్ భూములు కూడా ఆక్రమించి ఆన్‌లైన్ చేయించుకుంటున్నారు. ఇది ఇప్పుడున్న పాలకుల నిజస్వరూపం. కబ్జా చేసినవాటిలో ఏ ఒక్క ఎకరా కూడా వదిలిపెట్టే ప్రసక్తే లేదు. ప్రతి ఎకరాను రికవరీ చేయిస్తా. తిరిగి ప్రభుత్వానికి అప్పగించడమే నా ధ్యేయం. కొందరు నేతలు అధికారికంగా, అనధికారికంగా వందల ఎకరాలను ఆక్రమించుకున్నారు. ఇలా ఆక్రమించుకుంటూ పోతే భవిష్యత్తులో ప్రజల అవసరాలకు ఏమీ మిగలదు. విలువైన భూములు ఉన్న ప్రతి మండలంలో కచ్చితంగా అధికారంలోకి రాగానే విచారణ జరపడం తథ్యం. ఇందుకు సహకరించిన వారిపై కూడా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: సర్వరాయసాగర్ ప్రాజెక్టు విషయంలో ఏం చేయాలనుకుంటున్నారు?

జవాబు: సర్వరాయసాగర్ ప్రాజెక్టు వీరపునాయునిపల్లె మండల రైతులకు ఉపయోగపడాల్సి ఉంది. అయితే ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి చేపల చెరువు కోసం ఈ ప్రాజెక్టు నీళ్లను తరలిస్తున్నారు. ప్రాజెక్టు నిర్మాణంలో కాంట్రాక్టు కూడా వైసీపీ వారికే అప్పగించడంతో పనులు నాశిరకంగా జరిగాయి. ప్రాజెక్టు కట్టలు నెర్రలుబారి మనిషి దూరేంతగా ఉన్నాయి. దీంతో ప్రాజెక్టు కింద ఉన్న భూముల్లో నిత్యం ఊట నిలిచి కనీసం సాగుకు కూడా ఆ భూములు ఉపయోగం లేకుండాపోయాయి. ప్రత్యేకదృష్టి పెట్టి ఈ ప్రాజెక్టు రైతులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటా.

ప్రశ్న: కేసీ ఆయకట్టు రైతుల పరిస్థితి ఏమిటి?

జవాబు: చెన్నూరు మండలంలో కేసీ ఆయకట్టు రైతులు ఈ మారు చాలా ఇబ్బందులు పడ్డారు. ఇందుకు వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం. సకాలంలో నీరు ఇచ్చి ఉంటే ఈపరిస్థితి వచ్చేదికాదు. రైతులు ఇబ్బందిపడే వారు కాదు. వేలాది ఎకరాలు బీడుగా మారాయి. ఇది దారుణం. ఇలాంటి పరిస్థితుల్లో రైతులను ఆదుకోవడమే లక్ష్యం. భవిష్యత్తులో అటు ఖరీఫ్, ఇటు రబీ సీజన్లలో సాగునీటికి ఇబ్బంది లేకుండా దృష్టి సారిస్తా.

ప్రశ్న: పుష్పగిరి అభివృద్ధి కోసం ఏం చేస్తారు?

జవాబు: పుణ్యక్షేత్రమైన పుష్పగిరి అంటేనే దేశ వ్యాప్తంగా ఒక గుర్తింపు ఉంది. ఈ ప్రాంతంలో వర్షాకాలంలో భక్తులు పెన్నానదిని దాటాలంటే ఇబ్బంది. కచ్చితంగా పెన్నానదిపై చిన్నపాటి వంతెన నిర్మాణం చేయిస్తా. భక్తులకు ఉపయోగపడేలా చేస్తా, ఇది కూడా నియోజకవర్గ అభివృద్ధిలో ప్రధాన భాగమే.

ప్రశ్న: నియోజకవర్గ అభివృద్ధిపై ఎలాంటి దృష్టి ఉంది ?

జవాబు: కమలాపురంలో రైల్వేపై ఓవర్ త్వరగా ఏర్పాటు చేయిస్తాం. ఆ ప్రాంతంలో టీడీపీ పాలనలో 80 శాతం రోడ్లు పూర్తి కాగా మిగిలిన 20 శాతం కూడా ఈ ప్రభుత్వం చేయలేదు. మేము పూర్తి చేస్తాం. చెన్నూరులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేస్తాం. ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీటికి కుళాయిలు పెడతాం. ఆదినిమ్మాయపల్లె ఆనకట్ట అభివృద్ధికి అక్కడ నీటి నిల్వ సామర్థ్యానికి కృషి చేయాలన్నది లక్ష్యం. మంచి పరిశ్రమలు తీసుకువచ్చి ఈ ప్రాంతాన్ని పారిశ్రాకంగా అభివృద్ధి చేస్తాం. సమీపంలో కడప నగరం ఉంది. ఇక్కడ నుంచి చెన్నై, బెంగళూరు, హైదరాబాదు, విజయవాడ, కృష్ణపట్నం ద్వారా రాకపోకలకు అవకాశాలు కల్పించే రైల్వేస్టేషన్లను, విమానాశ్రాయం ఉంది. వాటిని మరింతగా ఉపయోగించడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. సాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడడమే నా ధ్యేయం.

వడదెబ్బకు వృద్ధుడు మృతి



ముద్దనూరు మే 9: మండల పరిధి కమ్మవారిపల్లెకు చెందిన నీలకంఠం గంగన్న(62) గురువారం మధ్యాహ్నం వడదెబ్బకు మృతి చెందినట్లు మృతుని బంధువులు తెలిపారు. బంధువుల సమాచారం మేరకు.. గంగన్న మంగళవారం వడదెబ్బకు గురయ్యాడు. అస్వస్థతకు లోనవడంతో వెంటనే ముద్దనూరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. సెలైన్ బాటిల్ ఎక్కించుకొని ఇంటికి తీసుకొచ్చినట్లు తెలిపారు. కాగా గురువారం మధ్యాహ్నం మృతి చెందాడని, ఈ మేరకు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించినట్లు మృతుని బంధువులు తెలిపారు.

ఇరువురు జైలు సిబ్బందిపై సస్పెన్షన్ వేటు

కడప (క్రైం), మే 9: కడప కేంద్ర కారాగారంలో బుధవారం ప్రమాదవశాత్తు చెట్టు పై నుంచి కింద పడి జీవిత ఖైదీ రంగయ్య మృతి చెందిన విషయం విదితమే. ఈ సంఘటనపై జైలు ఉన్నతధికారులు విచారించి నిర్లక్ష్యంగా విధులు నిర్వహించిన జైలు సిబ్బందిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే.. మంగళవారం రాత్రి కురిసిన వర్షాల కారణంగా జైలులో పాలడెయిరీపై చెట్టు విరిగిపడింది. చెట్టును తొలగిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కాలు జారి జీవితఖైదీ రంగయ్య కిందపడి తలకు గాయమై చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై జైలు పర్యవేక్షణాధికారి ప్రకాశ్ ఆధ్వర్యంలో కడప రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ జైలును సందర్శించారు. ఖైదీని పనిలో నియమించిన ఇన్‌చార్జ్ డిప్యూటీ జైలరు నారాయణరెడ్డి, కొండారెడ్డి, హెడ్‌వార్డర్లను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోండి : ఏఎస్పీ

పెండ్లిమర్రి, మే 9: రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును ప్రజలు స్వేచ్ఛగా వినియోగించుకోవాలని అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్ ప్రజలకు తెలిపారు. గురువారం మండలంలోని క్రిటికల్ పోలింగ్ కేంద్రాలైన మాచనూరు, చౌటిపల్లె, కొండూరు, తుమ్మలూరు, ఉలవలిపల్లె గ్రామాలను ఆయన సందర్శించారు. ఆయా గ్రామాలలోని ప్రజలతో మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశామని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కడప రూరల్ సీఐ నాగరాజు ఉన్నారు.



పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ (అడ్మిన్) సుధాకర్

ఒకరికి తీవ్ర గాయాలు

సీకేదిన్నె, మే 9: కడప-రాయచోటి జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో అన్నంరాజు ఆదినారాయణ అనే వ్యక్తికి తీవ్ర గాయాలైనట్లు సీకేదిన్నె సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు. సీఐ వివరాల మేరకు... కొలుములపల్లె కృష్ణాపురం గ్రామానికి చెందిన ఆదినారాయణ పని నిమిత్తం కడపకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా కొత్తరోడ్డు సమీపంలో వాటర్ ప్లాంట్ వద్ద లారీ ఆదినారాయణ బైకును ఢీకొంది. దీంతో అతనికి తీవ్ర గాయాలవడంతో చికిత్స నిమిత్తం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం వేలూరు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

వల్లూరు, మే 9: మండల పరిధిలోని పుల్లారెడ్డిపేటలో జడల హరి (30) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వారి సమాచారం మేరకు.. పుల్లారెడ్డిపేటకు చెందిన హరి గురువారం ఇంట్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందడంతో పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి వివాహం కాలేదని, తల్లిదండ్రులు ఉన్నారన్నారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉందన్నారు.

ఉరి వేసుకుని యువకుడు ఆత్మహత్య



మృతిచెందిన యువకుడు

జమ్మలమడుగు, మే 9: జమ్మలమడుగు పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదురు సందులో బుధవారం కుట్టుమిషన్ రిపేరు షాపులో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు మృతుడు జమ్మలమడుగు మండలం దేవగుడి గ్రామానికి చెందినవాడు. మూడు సంవత్సరాల నుంచి కుట్టుమిషన్ రిపేరు నేర్చుకోవడానికి వస్తున్నాడు. కాగా బుధవారం రాత్రి 9.30 గంటల సమయంలో షాపులో సెల్ మరచిపోయి వచ్చానని, అక్కడికి వెళ్లి రాత్రి అక్కడే ఉండి వస్తానని చెప్పి వెళ్లినట్లు మృతుడి తండ్రి షబ్బీర్, తల్లి ఫక్రుబీ తెలిపారు. కాగా ఉన్న కుమారుడు ఉరి వేసుకుని మృతి చెందడంతో షాపు వద్దకు వచ్చి బోరున విలపించారు. పోలీసులు సమాచారం తెలుసుకుని ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడు షాపులోని కడ్డీకి తాడుతో ఉరి వేసుకున్నట్లు పోలీసులకు తెలిపారు. వెంటనే పోలీసులు మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడు నిజంగా ఆత్మహత్య చేసుకున్నాడా లేక ఎవరైనా రాత్రి కొట్టి ఉరివేశారా అనే కోణంలో దర్యాప్తు చేస్తామని, ఉన్నతాధికారులకు పూర్తి వివరాలు తెలుపుతామని హెడ్‌కానిస్టేబుల్ ఖాదర్‌వలి తెలిపారు.

యువతి అదృశ్యం

కడప (క్రైం), మే 9: కడప నగరం ఎర్రముక్కపల్లెలో హాస్టల్‌లో ఉంటున్న ఓ యువతి అదృశ్యమైనట్లు వన్‌టౌన్ ఎస్ఐ రంగస్వామి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. నాయినిపల్లెకు చెందిన దాసరి రమ్యతేజ ఇంటర్ పూర్తి చేసుకుని ఎర్రముక్కపల్లెలో ఎంసెట్ కోచింగ్ తీసుకుంటూ హాస్టల్‌లో ఉంటోంది. బుధవారం మధ్యాహ్నం హాస్టల్ నుంచి బయటికి వచ్చి అదృశ్యమైనట్లు ఎస్ఐ తెలిపారు. యువతి తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

కడపలో గాలి మారుతోంది

సైకిలు వైపు జనం చూపు ● ఫ్యానుకు ఎదురుగాలి ● భూకబ్జాలు, దందాలతో విసిగిపోయిన జనం ● ఆస్తి, చెత్తపన్నుతో ఆగ్రహం

(కడప - ఆంధ్రజ్యోతి): కడప రాయలసీమకు నడిబొడ్డు. మత సామరస్యానికి ప్రతీక. ఎంతో చరిత్ర ఉన్న కడప అసెంబ్లీకి ఈ సారి జరగనున్న ఎన్నికలు హోరాహోరీగా సాగనున్నాయి. 20 ఏళ్లలో నాలుగు దఫాలుగా అటు కాంగ్రెస్, ఇటు వైసీపీ అభ్యర్థులకే జనం పట్టం కట్టారు. అయితే ఈసారి జనంలో మార్పు కనిపిస్తోందంటున్నారు. కడప గాలి మారి అది సైకిలు వైపు వీస్తోందని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ఈసారి జగన్ పార్టీ ఫ్యానుకు ఎదురుగాలే వీస్తోంది. వైసీపీ ఐదేళ్లలో కడపలో అరాచకం చోటు చేసుకుంది. భూకబ్జాలు, దందాలు, గంజాయి, సెటిల్‌మెంట్ల అడ్డాగా మారింది. కనిపిస్తే ఎక్కడ కబ్జా చేస్తారోనని జనం ఖాళీ స్థలాల వద్ద కాపలా ఉండే స్థితికి వచ్చింది. దీంతో పాటు గంజాయి విచ్చలవిడిగా దొరుకుతోంది. మళ్లీ గ్యాంగ్‌ల సంస్కృతి పురుడు పోసుకుంది. శాంతిభద్రతలు ప్రశ్నార్థకంగా మారాయి. దీంతో జనం మార్పు కోరుకుంటున్నారు. కడప అసెంబ్లీలో 13 మంది బరిలో ఉన్నారు. టీడీపీ నుంచి మొదటి పర్యాయం మహిళా అభ్యర్థిగా ఆర్.మాధవీరెడ్డి, వైసీపీ నుంచి డిప్యూటీ సీఎం అంజద్‌బాషా మూడోసారిపోటీ చేస్తుండగా కాంగ్రెస్ నుంచి అఫ్జల్ ఖాన్ పోటీ చేస్తున్నారు.

భూకబ్జాలు, దందాలమయం

జగన్‌పాలనలో కడపలో గతంలో ఎన్నడూ లేని విధంగా భూకబ్జాలు, సెటిల్‌మెంట్లు గ్యాంగ్‌లకు అడ్డాగా మారింది. డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయరు సురేష్‌బాబు వర్గీయులు పెద్దఎత్తున భూకబ్జాలకు పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి. ఓ సీఐని అడ్డుపెట్టుకుని వందల కోట్లు విలువ చేసే భూములు సెటిల్‌మెంట్లు చేశారనే విమర్శ లున్నాయి. కడపలో ఖాళీస్థలం కనిపిస్తే వెంటనే వాలిపోయి ఈ స్థలం మాదంటూ దౌర్జన్యాలకు దిగిన సంఘటనలు కోకొల్లలుగా జరిగాయి. సుమారు రెండు వేల కోట్లువిలువైన భూములు ఈ ఐదేళ్లలో కబ్జాకు గురయ్యాయనే ఆరోపణలున్నాయి. భూ దందాల నేపథ్యంలోనే వైసీపీకి చెందిన శ్రీనివాసరెడ్డిని సెటిల్‌మెంట్లలో తేడాలు రావడంతో తెల్లవారక ముందే జరిగిన మర్డరు కలకలం రేపింది. అధికారంలోకి వైసీపీ వచ్చిన తరవాత తొలుత రాజంపేట బైపాస్‌రోడ్డులోని కియా మోటర్స్ కార్ల షోరూం సమీపంలోని పది కోట్లు విలువైన ప్రైవేటు స్థలంలోకి నకిలీ పత్రాలతో వైసీపీ సైన్యం ఎంటర్ అయి చుట్టూ ప్రహరీ కట్టింది. అడ్డు చెప్పిన వారిపై దాడులకు పాల్పడ్డారు. చివరికి సెటిల్‌మెంటు చేసుకున్నారు. ఇక రిమ్స్ పోలీసుస్టేషన్ పరిధిలోనే ఖాళీగా ఉన్న ఇళ్ల స్థలాలను కబ్జా చేసేందుకు ప్రయత్నించగా బాధితులు ఎదురు తిరిగారు.



● మినిస్టరు కాలనీలో ప్రభుత్వ భూములు కూడా ఉన్నాయనే ఆరోపణలున్నాయి. ఈ కాలనీకి సంబంధించి ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. సాయిపేటలో బీఎస్ఎన్ఎల్ క్వార్టరుకు సంబంధించి స్థలాన్ని ఆక్రమించి లే అవుట్ వేశారని చెబుతారు. సాయిపేటలోనే ఎస్సీ ఎస్టీల భూములను ఆక్రమించి లేఅవుట్లను వేశారంటారు. పుట్లంపల్లెలో పది కోట్లు విలువైన భూమిని ఆక్రమించేశారు. ఇలా అక్కడ ఇక్కడ అని కాకుండా కడప నగరమంతా కబ్జాలమయమైంది. నలుగురు నేతలూ కడపను నలువైపులా పంచుకుని కేక్‌లా తినేశారు.

● చిన్నచౌకులో ఖాళీస్థలాలు ఉన్న వారి పరిస్థితి దయనీయంగా మారింది. ఎప్పుడో పూర్వం నుంచి వచ్చిన ఆస్తులు ఇప్పుడు డిమాండ్ వచ్చింది. ఖాళీగా ఉండడం చూసి ఓ నేత అనుచరులు ఇది మాదేనంటూ ఆక్రమణలకు దిగుతున్నారు. దీంతో కబ్జాదారుల బారిన ఉండి కాపాడేందుకు ఖాళీస్థలాలకు వీఎల్‌టీట్యాక్స్ వేయించుకున్నారు. ఇక ఎర్రముక్కపల్లె ప్రాంతంలో ఓ నేత చెరబట్టారు. రాజంపేట బైపాస్‌లోని ఎంఆర్ఎఫ్ టైర్స్ పక్కన వంక స్థలం ఆక్రమించేశారు. ఇలా చుట్టూ సుమారు రూ. 2వేలకోట్లు విలువైన భూములు అన్యాక్రాంతమయ్యాయని చెబుతారు. ఎన్నికల ముందు లూప్‌లైన్‌కు వెళ్లిన ఓ సీఐని అడ్డుపెట్టుకుని సుమారు వందకోట్ల విలువైన భూముల మ్యుటేషన్ జరిగాయంటారు. ఆ సీఐనే కోటి రూపాయలు స్థలాన్ని రూ.20 లక్షలకు సెటిల్‌మెంటు చేసి వైసీపీ నేతలకు అప్పజెప్పారన్న విమర్శలున్నాయి.

వైసీపీ పాలన పన్నులమయం

ఆస్తి పన్ను పెంపును జనం తీవ్రంగా వ్యతిరేకించినా జగన్ సర్కారు అమాంతం పెంచేసింది. దీంతో పన్నులు అమాంతంగా పెరిగాయి. ఇది పట్టణవాసులపై తీవ్ర ప్రభావం పడింది ఇక వద్దు వద్దన్నా కూడా చెత్త పన్ను వసూలు చేస్తున్నారు. కడపలో ఎన్నడూ లేని విధంగా నీటి సమస్య నెలకొంది. ఉద్యోగ ఉపాధ్యాయ వాపార వర్గాల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరే కత ఉంది. కడప అభివృద్ధికి కోట్లాది రూపాయలు కేటాయిస్తామని చెప్పినా కేవలం నాలుగురోడ్లు, సర్కిళ్ల పునరుద్ధరణకే పరిమితమైంది. దీంతో అటు యువత, ఉద్యోగులు వ్యాపారులు, విశ్రాంత ఉద్యోగుల్లో ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉంది. డిప్యూటీ సీఎం అంజద్‌బాషా రెండుసార్లు గెలిచినా ముస్లింలకు చేసేదేమీలేదంటారు. వక్ఫ్, ముస్లిం ఆస్తులు కబ్జాకు గురవడం ఆ వర్గంలో అసంతృప్తి ఉంది. ముస్లిం ఓట్లు గట్టెక్కిస్తాయని అంజద్‌బాషా గంపెడాశలు పెట్టుకున్నారు. మోదీ సర్కారు పార్లమెంటులో పెట్టిన ప్రతి బిల్లుకు జగన్ ప్రభుత్వం మద్దతు ఇచ్చింది. ఇవన్నీ ముస్లింలకు తెలుసు. ఇప్పుడు కాంగ్రెస్ నుంచి పార్లమెంటుకు షర్మిల అసెంబ్లీ నుంచి అఫ్జల్‌ఖాన్ బరిలో దిగుతున్నారు. ముస్లిం మైనార్టీలు, క్రిష్టియన్లు కాంగ్రెస్‌కు సాంప్రదాయకఓటర్లు. అయితే ఇప్పుడు షర్మిలా రాకతో జిల్లాలో కాంగ్రెస్‌కు ఊపు వచ్చింది. మైనార్టీలకు న్యాయం జరిగేది కాంగ్రెస్‌తోనే అని బలంగా చెబుతోంది. దీంతో మైనార్టీ ఓటర్లు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారు. ఫలితంగా టీడీపీ గెలుపు తప్పద న్నట్లు విశ్లేషకులు వివరిస్తున్నారు.

నియోజకవర్గ స్వరూపం

ఓట్లు - 2,83,543
పురుషులు - 1,38,300
మహిళలు - 1,45,153
ఇతరులు - 90

సామాజిక వర్గాల ఓట్లు సుమారు

ముస్లిం 70వేలు
రెడ్లు 43వేలు
బలిజ - 32 వేలు
మాదిగ - 19వేలు
మాల - 18వేలు
వైశ్యులు 14వేలు
దూదేకులు - 17వేలు
యాదవులు - 10వేలు

టీడీపీ అభ్యర్థి బలాలు



రెడ్డెప్పగారి మాధవి రెడ్డి,
కడప ఎమ్మెల్యే టీడీపీ అభ్యర్థి

● కడప అసెంబ్లీ నుంచి తొలి సారిగా మహిళ పోటీ చేస్తోంది
● మాధవీరెడ్డి 8 నెలలుగా కడపలో విస్తృతంగా ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేయడం
● ముక్కుసూటితనం, యాటిట్యూడ్‌తో జనాలకు త్వరగా కనెక్ట్ కావడం
● స్తబ్దుగా ఉన్న టీడీపీ కేడరులో జవసత్వాలతో జోష్ నింపడం
● డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, వైసీపీ వైఫల్యాలపై నేరుగా విరుచుకుపడే తీరు
● ఓటర్లను ఆకట్టుకోవడం
● వైసీపీ ఆగడాలను ధైర్యంగా ఎదుర్కోవడం
● కేడరుకు భరోసా కల్పించడం
● తటస్థులు టీడీపీవైపు మల్లేలా చూడడం
● బీజేపీ జనసేన పొత్తు.
● మహిళ కావడంతో తోటి మహిళల్లో విపరీతమైన సానుభూతి

బలహీనతలు

● 20ఏళ్లుగా కడపలో టీడీపీ గెలవక పోవడం.
● కేడరు చెల్లాచెదురైంది
● పార్టీ నేతలంతా సమన్వయంగా ముందుకు పోలేకపోవడం

డిప్యూటీ సీఎం బలాలు



ఎస్‌బీ అంజాద్ బాష,
కడప ఎమ్మెల్యే వైసీపీ అభ్యర్థి

● సొంత జిల్లా వాసి జగన్ ముఖ్యమంత్రిగా ఉండడం
● 2004 నుంచి ముస్లిం అభ్యర్థులే గెలుస్తుండడం
● బలమైన కార్యకర్తలు, నవరత్నాలు

బలహీనతలు

● ప్రభుత్వంపై ఉద్యోగ, వ్యాపార, నిరుద్యోగుల్లో తీవ్ర వ్యతిరేకత
● అంజద్‌బాషా కార్పొరేటరు, ఎమ్మెల్యేగా పనిచేసినప్పుడు సౌమ్యుడిగా పేరు.
● డిప్యూటీ సీఎం పదవి వచ్చిన తరువాత ఆయన వ్యవహార శైలిలో మార్పు రావడం
● తమ్ముడు, అల్లుళ్ల పెత్తనం ఎక్కువ కావడం
● భూకబ్జాలు, సెటిల్‌మెంట్లు కడపలో తాగునీటి కోసం జనం అవస్థలు పడడం మైనస్‌గా మారింది
● సొంతంగా కేడరు లేకపోవడం
● కార్పొరేటరు నుంచే అభివృద్ధి పనుల్లో 8 శాతం కమీషన్లు తీసుకోవడం


ఓటరు ఐడీ కార్డు లేకున్నా ఓటెయ్యొచ్చు

● ఓటరు ఐడీ, ఓటరు స్లిప్పు ఒక్కటి కాదు



కలికిరి, మే 9: ప్రతి ఓటరుకూ గతంలోనే ఓటరు ఐడీ కార్డులు పంపిణీ చేశారు. ఓటరుగా నమోదు కాగానే ఈ ఓటరు కార్డును నేరుగా ఎన్నికల కమిషన్ అధికారులే ఇంటికి పోస్టు ద్వారా పంపుతారు. పోలింగ్ రోజు ఓటు వేయడానికి ఈ ఓటరు ఐడీ కార్డు తప్పనిసరి. అయితే చాలా మంది దగ్గర ఓటరు ఐడీ కార్డు లేకపోవడంతో ఈ విషయంలో ఎన్నికల కమిషను కొన్ని వెసులుబాట్లు కల్పించింది. ఓటరు జాబితాలో పేరుండీ, ఓటరు కార్డు లేని వారు ప్రత్యామ్నాయంగా 12 రకాల ఐడీ కార్డుల్లో దేన్నైనా చూపించి ఓటెయ్య వచ్చు. గుర్తింపు కార్డుల్లో ఆధార్, డ్రైవింగ్ లైసెన్సు, పాన్, ఉపాధి హామీ జాబ్ కార్డు, పాస్‌పోర్టు, బాంకు/పోస్టాఫీసు జారీ చేసిన ఫొటోతో కూడిన పాస్ పుస్తకం, కార్మిక శాఖ మంజూరు చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ కార్డు, నేషనల్ పాపులేషన్ రిజిష్టరు (ఎన్‌పీఆర్) స్మార్ట్ కార్డు, ఫొటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంటు, కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగులకు జారీ చేసే సర్వీస్ ఐడీ కార్డు, అత్యవసర సమయాల్లో ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ధృవీకరించే గుర్తింపు కార్డు, దివ్యాంగులకు జారీ చేసే ఐడీ (యూడీఐడీ)కార్డుల్లో ఏదైనా చూపించి నిరాటంకంగా ఓటెయ్య వచ్చు.

ఓటరు ఐడీ, ఓటరు స్లిప్పు ఒక్కటి కాదు



అయితే ఓటరు ఐడీ కార్డు ఓటరు స్లిప్పు ఒక్కటి కాదు. ఇవి రెండూ వేర్వేరయినవని గమనించాలి. ఈ రెండూ కూడా ఓటరు జాబితాలో పేరు నమోదైన వారికి మాత్రమే జారీ చేస్తారు. ప్రస్తుతం పోలింగ్‌కు ముందు బీఎల్వోలు అందజేస్తున్న ఓటరు స్లిప్పులు చెల్లుబాటు కావు. ఈ ఓటరు స్లిప్పులు ఓటరు జాబితాలో ఏ పోలిగ్ బూత్‌లో, ఏ వరుస సంఖ్యతో నమోదై వుందన్న విషయాన్ని పోలింగ్ సిబ్బంది సులభంగా గుర్తించడానికి మాత్రమే ఉపయోగపడుతుంది. ఓటరు స్లిప్పులో కూడా ఓటు వేయ డానికి ఇది గుర్తింపు కార్డుగా ఆమోదించబడదని స్పష్టంగా ముద్రించి వుంది కూడా.

వలంటీర్ల ద్వారా ఓటరు స్లిప్పుల పంపిణీ

కలికిరి, మే 9: మండలంలో పలు చోట్ల వలంటీర్ల ద్వారా ఓటరు స్లిప్పులు పంపిణీ చేస్తున్నారు. సంబంధిత బీఎల్వోలు మాత్రమే ఓటరు స్లిప్పులను ఇంటింటికీ అందజేయాల్సి వుంది. గ్రామాల్లో మాత్రం ఎక్కువగా ఇదే పద్ధతి అనుసరిస్తుండగా కలికిరిలో మాత్రం ఓటరు స్లిప్పుల పంపిణీకి బీఎల్వోదూరంగా వున్నారని ఆరోపిస్తున్నారు. తమ పరిధి వలంటీర్ల ద్వారా బీఎల్వోలు ఓటరు స్లిప్పులు పంపిణీ చేయించడంపై పలువురు ఆరోపణలు చేస్తున్నారు. వాస్తవానికి ఎన్నికల విధులకు వలంటీర్లను దూరంగా వుంచాలని ఎన్నికల కమిషన్ పదేపదే హెచ్చరిస్తున్నా ఇంటింటికీ స్లిప్పుల పంపిణీలో బీఎల్వోలు బద్ధకిస్తూ వలంటీర్లను పురమాయిస్తున్నారు. ఆరోపణలకు అనువుగానే వలంటీర్లు కూడా వరుసగా అందరికీ స్లిప్పులు ఇవ్వకుండా పార్టీల పరంగా వివక్ష చూపిస్తున్నారని విమర్శిస్తున్నారు. పట్టణంలో ఇలాంటి ఆరోపణలు ఎక్కువగా వస్తున్నాయి. స్థానిక రెవెన్యూ అధికారులు ప్రధాని పర్యటనలో నిమగ్నం కావడంతో బీఎల్వోలు నిబంధనలకు విరుద్ధంగా వలంటీర్లను రంగంలోకి దించారు. ఓటరు స్లిప్పులు లేకున్నా ఓటు వేయ దానికి పెద్దగా అడ్డంకి లేకున్నా మరో రకంగా ఓటరు స్లిప్పులకు డిమాండు ఏర్పడింది. అభ్యర్థులు ఓటర్లకు తాయిలాలు పంపిణీ చేసేటప్పుడు ఓటరు స్లిప్పులు చూపించిన వారికే అందజేస్తున్నారని తెలియడంతో వీటి కోసం ప్రజలు పరుగులు పెడుతున్నారు. పట్టణ ప్రాంతాలో స్లిప్పులను పంపిణీ చేయడంలో బీఎల్వోలు నిర్లిప్తంగా వుంటూ వలంటీర్ల ద్వారా పురమాయించడం నిబంధనలకు పూర్తి విరుద్ధమే కాకుండా అందరికీ సక్రమంగా పంపిణీ చేయడం లేదని చెపుతున్నారు. ప్రధానంగా కలికిరిలో నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న విషయంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి తొందరగా స్లిప్పులు ప్రజలకు చేర్చాలని పలువురు కోరుతున్నారు.

జిల్లాలో ఓటర్లు 16, 27,356 మంది

మహిళలు 832070 ● పురుషులు 795071 ● ఇతరులు 215

కడప(కలెక్టరేట్)మే9: సాధారణ ఎన్నికలు -2024 మే 13న జరిగే ఎన్నికల్లో జిల్లాలో 16,27356 మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పురుషులు 7,95,071, మహిళలు 8,32,070, ఇతరులు 215 మంది ఉన్నారు. కాగా మహిళా ఓటర్లు పురుషుల కంటే 37001 మంది అధికంగా ఉన్నారు. మహిళా ఓటర్లు ఈదఫా ఎన్నికల్లో అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చనున్నారు. కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించి ఈనెల 14 అర్ధరాత్రి నాటికి ఫారం-6కు సంబంధించి 4 వేల పైచిలుకు మంది కొత్త ఓటర్లుగా ధరఖాస్తు చేసున్నారు. వీరందరి క్రోడీకరించి అర్హులకు ఓటు కల్పించేందు కు ఎన్నికల సిబ్బంది కసరత్తు ముమ్మరం చేశారు. 25వతేదీన ఓటర్ల జాబితా ప్రకటన నాటికి జిల్లాలో 16.30లక్షల ఓటర్లు నమోదయ్యే అవకాశాలున్నాయి.

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
బద్వేలు	108522	109487	05	218014
కడప	136435	143313	90	279838
పులివెందుల	111070	117284	18	228372
కమలాపురం	99083	103487	34	202604
జమ్మలమడుగు	117295	124332	15	241642
ప్రొద్దుటూరు	119130	127040	48	246218
మైదుకూరు	103536	107127	5	210668
మొత్తం	795071	832070	215	1627356

నింగికెగిసిన టికెట్ ధరలు

● ఓటర్లను దోచుకుంటున్న వైనం
● కడప జిల్లాకు వచ్చేందుకు రెండువేలు పైమాటే
● లబోదిబోమంటున్న ప్రజలు

బద్వేలు రూరల్, మే 9: హైదరాబాద్, బెంగళూరు నగరాల్లో కడప జిల్లా వాసులు వేలమంది నివసిస్తున్నారు. వివిధ వృత్తు ల్లోనూ, సాఫ్ట్‌వేర్ విభాగాల్లో, పీజీ కేంద్రాలు నడుపుతూ ఉంటున్నారు. ప్రస్తుతం ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో స్వగ్రామాలకు వచ్చి ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటుంది. ఇందు కోసం హైదరాబాద్, బెంగళూరు నుంచి కడప, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు, రాజంపేట, రాయచోటి, రైల్వేకోడూరు, తిరుపతి, తదితర ప్రాంతాలకు బస్సుల్లో వెళ్లాలంటే ముందే టిక్కెట్లు బుక్ చేసుకుంటారు. ప్రస్తుతం ఓటు హక్కు వినియోగించుకునేందుకు హైదరాబాద్ నుంచి కడప, ప్రొద్దుటూరుకు రావాలన్నా సుమారు రెండువేలు ధర పలుకుతోంది. ఈధర కూడా ఏసీ స్లీపర్ క్లాస్ కాదుసుమా... సిట్టింగ్ బస్సుల్లోనే. ఇక స్లీపర్, ఏసీ తదితర బస్సుల్లో అయితే చెప్పవీలుకాదు. హైదరాబాద్, బెంగళూరు నగరాల్లో లక్ష పైచిలుకు జిల్లా వాసులు పనిచేస్తున్నారు. వీరంతా ప్రస్తుతం 13వ తేదీన ఓటు హక్కు వినియోగించుకునేందుకు సొంత ప్రాంతాలకు రావాలని ఇప్పటికే అనేక మంది రైళ్లల్లో టిక్కెట్లు బుక్ చేసుకున్నారు. రైళ్లలో టికెట్లు అమ్ముడుపోయి వెయిటింగ్ లిస్ట్ వందల సంఖ్యకు చేరుకుంది. దీంతో బస్సులకు మరింత డిమాండ్ పెరిగింది. ప్రైవేటు బస్సుల వారు ఇలా దోచుకుంటుంటే ఆర్టీసీ వారు మరో అడుగు ముందుకేసి స్పెషల్ బస్సుల పేరుతో నడుపుతూ వారు సైతం దోచుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు విమానయానాల్లో సైతం రానుపోను పది శాతం ధర తగ్గిస్తుంటే బస్సుల యజమానులు దోచుకునేందుకు సిద్ధమయ్యారు. దీంతో కొందరు ఓటర్లు స్థానికులకు చెప్పి వాహనాలు పంపమని కోరడం, మరికొందరు సొంత వాహనాల్లో రావాలనుకుంటున్నారు.







జిల్లా మొత్తం 140 సర్వీసులు

జిల్లాలోని ప్రధాన కేంద్రాల నుంచి హైదరాబాదు, బెంగుళూరు తదితర ప్రాంతాలకు 140 పైచిలుకు ప్రైవేటు బస్సులు నడుపుతున్నారు. సాధారణంగా అయితే వీటి టికెట్ల ధర రూ.800 నుంచి వెయ్యి వరకు ఉంటుంది. మరీ అన్‌సీజన్ అయితే రూ.500కు కూడా ఇందులో ప్రయాణించే వీలుంటుంది. అయితే ఎన్నికల సమయాన్ని ఉపయోగించుకుని టికెట్ ధర అమాంతం పెంచి రూ.2500 వరకు దోచేస్తున్నారు.

లబోదిబోమంటున్న సాధారణ ఓటర్లు

హైదరాబాదు, బెంగుళూరు నగరాల్లోని సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు అంతో ఇంతో స్థిరపడ్డ వారు సొంత వాహనాల్లో జిల్లాకు వచ్చేందుకు సిద్ధంగా ఉన్నారు. కానీ సాధారణ కార్మికునిగా చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకునేవారు దాదాపు 2వేలకు పైబడి టికెట్ చెల్లించి స్వగ్రామాలకు చేరుకుని ఓటు వేయాలంటే బెంబేలెత్తుతున్నారు. కానీ ప్రైవేటు యాజమాన్యాలను కట్టడి చేసేందుకు అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఇండిగో ఫ్లైట్ బంపర్ ఆఫర్

దేశంలో సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని ఇండిగో ఫ్లైట్ స్థాపించి 18 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఓటు వేసేందుకు వెళుతున్న వారి కోసం ఎక్కడి నుంచి ప్రయాణించినా టికెట్ ధరలో పది శాతం రాయితీ ఉంటుందని ఇండిగో యాజమాన్యం ప్రకటించింది. అయితే ఇక్కడ ఉన్న ప్రైవేటు బస్సు యాజమాన్యాలు మాత్రం ఓటరును దోచుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఓటరుపై ఎటువంటి కరుణ చూపడంలేదన్న ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఓటు వేసేందుకు జిల్లావాసుల ఆసక్తి

రాష్ట్రంలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలను పురస్కరించుకుని ఇతర రాష్ట్రాల్లో ఉన్న కడప జిల్లావాసులు ఈ దఫా ఎన్నికల్లో ఓట్లు వేసేందుకు ఆసక్తి కనబరు స్తున్నారు. అందుకు కారణం.. రాష్ట్రంలో ఐదేళ్లగా వైసీపీ పాలనలో అస్తవ్యస్తంగా ఉండడం, యువత కు ఉద్యోగ ఉపాధి లేకపోవడంతో తామంతా ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సి వచ్చిందని అంటున్నారు. ఈ దఫా ఎన్నికల్లో తమకు నచ్చిన పార్టీకి ఓట్లు వేయాలన్న ఆత్రుత వారిలో కనిపిస్తోంది. అయితే బస్ చార్జీల ధర వారిని ఇబ్బంది పెడుతోంది రాజ కీయ పార్టీల నేతలు స్పెషల్ బస్సుల ద్వారా ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఓటర్లను తరలించాలని సిద్ధపడుతున్నారు.

అధికారులకు తెలిసే.....

విద్యుత్ స్తంభాలపై జగన్ స్టిక్కర్లు



పోరుమామిళ్ల, మే 9: ప్రభుత్వ భవనాలు, కార్యాలయాలపై ఏ రాజకీయ పార్టీల నేతల స్టిక్కర్లు అంటించరాదని చెబుతున్నా వైసీపీ నేతల్లో మాత్రం మార్పు కానరావడంలేదు. మండలంలోని టేకూరుపేట పంచాయతీ సూరిశెట్టిపల్లె, కొట్టాలపల్లె గ్రామాల్లో కొన్ని భవనాలకు సిద్ధం స్టిక్కర్లు అంటించారు. అలాగే విద్యుత్ స్తంభాలను కూడా వదలకుండా వాటన్నింటిపై కూడా సిద్ధం స్టిక్కర్లు అంటించారు. శ్రీరామ్‌నగర్‌లో కొన్ని గృహాలకు జగన్ స్టిక్కర్లను అంటించారు. ఇంత జరుగుతున్నా మొబైల్ టీం కానీ, ఎన్నికల కమిషన్ వారు కానీ చర్యలు తీసుకోకపోవడం విడ్డూరం.

బెదిరింపుల పర్వం.....

ఓటెయ్య రాదు.. ఏజెంట్లుగా కూర్చో రాదు

● వైసీపీ నేతలు బెదిరిస్తున్నారంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు



కడప కలెక్టరేట్ ఎదుట తుపల్లె గ్రామస్తులు

మైదుకూరు, మే 9: మీరు పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓట్లు వెయ్యొద్దు.. అలాని మీరు ఏజెంట్లుగా కూడా కూర్చోవద్దంటూ వైసీపీ నేతలు బెదిరిస్తున్నారని తువ్వపల్లె వాసులు కలెక్టర్ విజయరామరాజు, ఆర్వో చంద్రమోహన్, సీఐ మస్తాన్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఎస్సీలమైన మేమంతా ఓటు హక్కు వినియోగించుకునేందుకు, ఏజంట్‌గా ఉండేందుకు తగిన భద్రత కల్పించాలంటూ వారు ఫిర్యాదులో కోరారు. స్థానిక వైసీపీ నేతలైన ఊటుకూరు రఘురామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి తదితరులైన ఏడుగురు మమ్మల్ని బెదిరిస్తున్నారంటూ వినతిపత్రం ద్వారా ఫిర్యాదు చేశారు. 128, 133, పోలింగ్ కేంద్రంలో మా ఓట్లు ఉన్నాయని, భద్రత ఇచ్చి, ప్రాణాపాయం నుంచి కాపాడాలంటూ వారు విన్నవించుకున్నారు.

తెలుసుకోండి.....

రేపటి నుంచి ప్రచారం పరిసమాప్తం

కలికిరి, మే 9: శనివారం సాయంకాలంతో ఎన్నికల ప్రచారం పరిసమాప్తం కానుంది. సోమవారం పోలింగ్ జరగనుండగా నిబంధనావళి మేరకు 48 గంటల్లోగా ఎన్నికల బహిరంగ ప్రచారాన్ని అభ్యర్థులు ముగించాల్సి వుంటుంది. దీంతో హోరెత్తిస్తున్న వాహనాల ద్వారా మైకుల్లో ఊదరగొట్టడం, బహిరంగ సభలు ఏర్పాటు, ర్యాలీలు తదితర వాటికి ఫుల్‌స్టాప్ పెట్టాల్సి వుంది. ఏపీలో నాలుగో విడతలో ఎన్నికలు ప్రకటించడంతో షెడ్యూలు ప్రకటించినప్పటి నుంచీ సుదీర్ఘ కాలం పాటు అభ్యర్థులు ప్రచారాన్ని సాగించారు. ప్రచారం ముగింపు గడువు సమీపిస్తుండడంతో అభ్యర్థులు కూడా ప్రచారానికి ప్రాధాన్యత తగ్గించి ఇతరత్రా విషయాలపై దృష్టి సారిస్తున్నారు. పోల్ మేనేజ్‌మెంట్ ప్రక్రియలను తెరమీదకు తెస్తున్నారు. ఇందులో ప్రధానంగా ఓటర్లకు డబ్బు పంపిణీ వంటి అంశాలున్నాయి.

రెండు రోజులపాటు మద్యం షాపులు బంద్

పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు మద్యం షాపులను మూసేయాల్సి వుంటుంది. పోలింగ్ ముగిసిన అనంతరం మాత్రమే తిరిగి షాపులు అందుబాటులోకి వస్తాయి. అదే విధంగా ఓట్ల లెక్కింపు రోజు అంటే జూన్ 4వ తేదీ కూడా మద్యం షాపులకు విరామముంటుంది.

ఓటేశారా... ఇలా చూసుకోండి

మైదుకూరు, మే9: పోలింగ్ రోజున ఈవీఎంలో మనం ఏ అభ్యర్థికి ఓటు వేశామో వెంటనే చూసుకోవచ్చు. మనకు నచ్చిన అభ్యర్థికి వేసిన ఓటు సక్రమమేనా లేక క్రాస్ అయిందా అనే అనుమానాన్ని నివృత్తి చేసుకునే అవకాశాన్ని ఎలక్షన్ కమిషన్ కల్పించింది. ఓటరు వెరిఫేయబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్ (వీవీ ప్యాట్) ద్వారా ఈ అవకాశాన్ని కల్పించారు. వేసిన ఓటును చూసుకునే అవకాశం కేవలం ఏడు సెంకడ్ల సమయమే ఉంటుంది. అనంతరం వీవీప్యాట్ బాక్స్‌లో పడిపోతుంది. మనం వేసిన ఓటు పేపర్‌పై ప్రింట్ అవడంతో వీవీ ప్యాట్‌లో ఆ పేపర్ మనకు కనిపిస్తుంది.

ప్రజా సేవకే నా రాజకీయ జీవితం అంకితం

ఒక్కసారి ఆదరించండి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా ● బి.మఠంలో పుట్టా రోడ్‌షోకు బ్రహ్మరథం





బీ మఠం... కమ్మవారిపల్లెలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న పుట్టా సుధాకర్‌యాదవ్, మైదుకూరులో మాట్లాడుతున్న పుట్టా సుధాకర్‌యాదవ్

బ్రహ్మంగారిమఠం, మే 9 : ప్రజా సేవకే తన రాజకీయ జీవితం అంకితం చేస్తానని ఒక్కసారి అవకాశం ఇవ్వండి, నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మైదుకూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. గురువారం బ్రహ్మంగారిమఠం మండలంలోని కమ్మవారిపల్లె గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. అనంతరం పెద్దరాజుపల్లె, దిరసవంచ, నాగిశెట్టిపల్లె, నందిపల్లె గ్రామాలకు రోడ్‌షోగా బయల్దేరుతూ ప్రజలకు అభివాదం చేస్తూ బయల్దేరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రచార సమన్వయ కర్త పుట్టా ఆనంద్‌యాదవ్, బి.మఠం మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, ముడుమాల పోలిరెడ్డి, ,ముద్దుక్రిష్ణమ నాయుడు, చాణక్యనాయుడు, రాఘవేంద్రనాయుడు, సర్పంచ్ నారాయణ, చిలమల నాగయ్య, మణ్యం నాగేశ్వర్‌రెడ్డి, మణ్యం రవిశంకర్‌రెడ్డి , పొడపాటి వెంకటేశ్‌నాయుడు,పొడపాటి బీమానాయుడు, ఎల్.రమణారెడ్డి, రంగయ్య, భగీరథ, వీరయ్య, కొండపల్లి ఉమాకాంత్, కట్టా సుబ్బయ్య, బోయపాటి సుమన్, కేవీ సుబ్బారెడ్డి, వేల్పుల సుదర్శన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

దువ్వూరు(మైదుకూరు)..: ఎన్డీఏ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్‌ను గెలిపించాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. మండల కేంద్రమైన దువ్వూరులోని ఓ కళ్యాణ మండపంలో గురువారం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా పుట్టా సుధాకర్ యాదవ్, ఎంపీ అభ్యర్థిగా చదిపిరాళ్ళ భూపేశ్‌రెడ్డిలను గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజగోపాల్‌రెడ్డి, మనోహర్, గుర్రప్ప, ప్రతాప్, బాలరెడ్డి, శ్రీనివాసులు, బాష తదిరులు పాల్గొన్నారు. కాగా దువ్వూరు మండలం చింతకుంట పంచాయతీలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన పలువురు వైసీపీ నాయకులు గురువారం సాయంత్రం టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ సమక్షంలో టీడీపీలో చేరారు. పల్లె మోహన్, జాషువా, వినయ్, సుదర్శన్ వారి కుటుంబ సభ్యులు, అనుచరులు టీడీపీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయ్, భాస్కర్, నాయుడు, హుస్సేన్ పిరా తదితరులున్నారు.

మైదుకూరు..:జనసేన, బీజేపీ, టీడీపీల సమష్టిగా కృషితోనే మైదుకూరు అభివృద్ధి చేస్తామని టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో జనసేన ఇన్‌చార్జ్ మల్హోత్ర అధ్యక్షతన జనసేన కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్డీఏ కూటమి అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్‌ను గెలిపించాలని మల్హోత్రి కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

జాండ్లవరంలో 50 కుటుంబాలు చేరిక..: మండలంలోని జాండ్లవరం వీఆర్వో కాలనీలో వైసీపీకి చెందిన దాదాపు 50 కుటుంబాలవారు గురువారం టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ సమక్షంలో టీడీపీలో చేరారు. సంబటూరు రాజ, ప్రకాశం, సన్నా, రామిరెడ్డి, భాస్కర్ , బాలరాజు తదితర దాదాపు 50 కుటుంబాలు టీడీపీలో చేరారు.



మైదుకూరు.. పుట్టా సుధాకర్‌యాదవ్ ప్రచారానికి హాజరైన జాండ్లవరం వాసులు



ఖాజీపేట.. దుంపలగట్టులో ప్రచారం నిర్వహిస్తున్న పుట్టా వెంకటస్వామి

శ్రీరామ్‌నగర్‌లో పోటెత్తిన జనం..: పుట్టా సుధాకర్ యాదవ్ గురువారం జీవీసత్రం శ్రీరామ్‌నగర్‌లో ప్రచారానికి గ్రామస్థులు పోటెత్తారు.

ఖాజీపేట..: మన రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధికారంలోకి రావాలని ఆ పార్టీ నాయకులు పుట్టా వెంకటస్వామి, దుగ్గిరెడ్డి సరళ అన్నారు. మండల గురువారం మండల పరిధిలోని దుంపలగట్టు, నాగపట్నం, అగ్రహారం, కోటంగురాయుపల్లె, నాగసానిపల్లె గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, జనసేన ఇన్‌చార్జి మల్‌హోత్ర, లక్ష్మీదేవి, రవి, ఇండ్ల సుబ్బారెడ్డి, దుగ్గిరెడ్డి లక్ష్మీరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, గోవిందరెడ్డి, కిశోర్‌కుమార్‌రెడ్డి, ఫరూక్, సుబ్బయ్య, చంద్ర ఓబుళరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, బొంగు శ్రీనివాసులు, కమ్మా నరసింహులు, రామసుబ్బయ్య, మురళి, క్రిష్టారెడ్డి పాల్గొన్నారు. కాగా ఖాజీపేట అగ్రహారం ప్రజలు, నాయకులు మాజీ మంత్రి డీఎల్ రవీంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ సుభద్రమ్మ వద్దకు భారీగా కార్యకర్తలు చేరుకుని ప్రచారం ఆయన స్వగృహం నుంచి ప్రారంభించారు.

ఓటుతో వైసీపీకి బుద్ధి చెప్పండి : వరద

ప్రొద్దుటూరు ,మే 9 : ఓటుతో వైసీపీకి బుద్ధి చెప్పాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి పిలుపు నిచ్చారు. గురువారం మండల పరిధిలోని చెన్నమరాజులపల్లె, నాగాయపల్లెలో వరద ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, కొత్తపల్లె సర్పంచ్ శివచంద్రారెడ్డి, చెన్నమరాజుపల్లె వెంకట సుబ్బయ్య, శ్రీను,గంగులు ,రాజా, బాలపుల్లయ్య, బలరాముడు, నాగాయపల్లె శేషారెడ్డి, బాలయ్య, బాలక్రిష్ణ, వశిష్ట పాల్గొన్నారు.



చెన్నమరాజుల పల్లె ప్రచారంలో పాల్గొన్న వరదరాజులరెడ్డి

నందమూరి అభిమానికి సైకిల్‌గుర్తు బహూకరణ..: తెలుగుదేశం పార్టీ కార్యక్రమాల విజయవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్ళినందకు నందమూరి అభిమాని కడప పార్లమెంట్ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి నాసారి లక్ష్మీనరసింహంకు సైకిల్ గుర్తు టేబుల్ టాప్ స్టాండ్‌ను బహూకరించారు. గురువారంస్థానిక టీడీపీ కార్యాలయంలో వరదరాజులరెడ్డి తన చేతుల మీదుగా అందజేశారు. ఈ గుర్తును పార్టీ కేంద్ర కార్యాలయంనుంచి పంపినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో నందమూరి యువ సేవాసమితి అధ్యక్షుడు గోమేధికం సుదర్శన్, వెంకట సుబ్బయ్య, కూనపురి రామునాయుడు,ఘంటశాల వెంకటేశ్వర్లు, చౌడం సుబ్బయ్య పాల్గొన్నారు.



సైకిల్ గుర్తును అందజేస్తున్న వరదరాజులరెడ్డి

ముస్లిం మైనారిటీల హక్కుల పరిరక్షణ బాధ్యత టీడీపీదే ..: ముస్లిం మైనారిటీల హక్కుల పరిరక్షణ టీడీపీదే అని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. గురువారం22,23,24 ముస్లిం మైనారిటీ వార్డులలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి అభ్యర్థులను ఎంపీ, ఎమ్మెల్యేలుగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలోవీఎస్‌ముక్తియార్, జబీవుల్లా, వైఎస్‌మహ్మద్ గౌస్, బేపారి జాకీర్, మున్నా ఖలీల్, బేపారిగౌస్ బేపారి ఆరిఫ్, ఖలందర్ పాల్గొన్నారు.



22,23, 24 వార్డుల ప్రచారంలో పాల్గొన్న వరదరాజులరెడ్డి తదితరులు

వైసీపీ నుంచి టీడీపీలో చేరిన 100 కుటుంబాలు..: ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె పంచాయతీ లోని అమృతనగర్‌లో వైసీపీనుంచి 100 కుటుంబాలు టీడీపీలో చేరాయి. గురువారం అమృతనగర్‌లో మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, సర్పంచ్ శివచంద్రారెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరికలు జరిగాయి. కార్యక్రమంలో వంగనూరు మురళీధర్‌రెడ్డి, వెల్లాల భాస్కర్ ఎంపీటీసీ సౌభాగ్య పాల్గొన్నారు. పార్టీలో చేరినవారిలోపెద్దముడియం మహబూబ్‌బాషా, గౌబు, షరీఫ్, బుజ్జి, ఇంద్ర, బాషా అక్బర్, రసూల్, శివ సుదర్శన్, అశోక్, ఇర్ఫాన్ మాడి శెట్టిప్రతాప్ వున్నారు.

కూటమి విజయంతోనే రాష్ట్రం అభివృద్ధి..: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయంతోనే రాష్ట్రం అభివృద్ధి సాధ్యమని వరదరాజులరెడ్డికుమార్తెలు అనురాధ, అరుణ, కోడలు మీనా పేర్కొన్నారు. గురువారం 26 వవార్డులో కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులైె భూపేశ్‌రెడ్డిని వరదరాజులరెడ్డిని గెలిపించాలని ఇంటింటికి వెళ్ళి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ తలారి పుల్లయ్య, తలారిరమేష్, భరతసింహారెడ్డి, రాజా బోగాల లక్ష్మీనారాయణమ్మ, శివకళ్యాణి, వరద మనుమరాళ్ళు కోమల్ ,శిల్ప, రమణి, చమేలి, వసంత, గురులక్ష్మి, చీమలు జ్యోతి పాల్గొన్నారు.



26 వవార్డు ప్రచారంలో పాల్గొన్న వరదరాజులరెడ్డి కుమార్తెలు, కోడలు



టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి , సర్పంచ్ శివచంద్రారెడ్డి

టీడీపీ గెలిస్తే కడప అభివృద్ధికి బాటలు

● పెన్షనర్లు, ఉద్యోగులు అందరికీ 1వతేదీనే జీతాలు... ● కడప పార్లమెంటు అభ్యర్థి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి



ఆర్ట్స్‌కాలేజీలో వాకర్స్‌తో మమేకమైన భూపేశ్‌రెడ్డి, పక్కన విష్ణువర్ధన్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి



విజయదుర్గా ఆలయంలో దుర్గాప్రసాద్ నుంచి జ్ఞాపిక అందుకుంటున్న భూపేష్‌రెడ్డి

(కడప - ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులను గెలిపిస్తే కడప అభివృద్ధికి బాట పడుతుందని టీడీపీ అభ్యర్థి చదిపిరాళ్ళ భూపేశ్‌రెడ్డి అన్నారు. గురువారం కడప నగరంలోని ఆర్ట్స్ కాలేజీలో వాకర్స్‌తో కలిసి వాకింగ్ చేస్తూ ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేశ్‌రెడ్డి వాకర్స్‌తో మమేకమయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్ మన జిల్లావాసి అని గెలిపించాం, అయితే జిల్లా అభివృద్ధికి పాటుపడడంలేదు. జిల్లాలో నిరుద్యోగులు ఉపాధి లేక పొరుగు రాష్ట్రాలకు, విదేశాలకు వలస బాట పడుతున్నారన్నారు. కడపలో స్టీలు ఫ్యాక్టరీ పూర్తి చేసుంటే ప్రత్యక్షంగా పరోక్షంగా 50వేల మందికి ఉద్యోగాలు వచ్చేన్నారు. అయితే జగన్ పట్టించుకోలేదన్నారు. చంద్రబాబు హయాంలో అనంతపురం జిల్లాలో కియా పరిశ్రమకు భూమిపూజ జరిగిందని, అలాగే ఆయన హయాంలోనే ఉత్పత్తి కూడా జరిగిందన్నారు. ఆర్థిక కష్టాలున్నా చంద్రబాబు 43 శాతం జీవోలకు ఫిట్‌మెట్ ఇచ్చారన్నారు. క్రమం తప్పకుండా వేతనాలు ఇచ్చారు. అయితే ఇప్పుడు ప్ర భుత్వ ఉద్యోగులన్నా పెన్షనర్ల అన్నా జగన్‌కు మహా చిరాకు అన్నారు. ఉన్నత విద్యావంతులు, మేధావులంతా ఈ సారి టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని ఈ సందర్భంగా భూపేశ్‌రెడ్డి ప్రజలను కోరారు.

బస్టాండ్ పైకప్పు పెచ్చులూడి పడి మహిళకు గాయాలు

బద్వేలు, మే 9 : బద్వేలు ఆర్టీసీ బస్టాండులో గోపవరం మండలం, రాచాయపేటకు చెందిన జయమ్మ అనే మహిళకు గాయాలయ్యాయి. గురువారం మధ్యాహ్నం బస్సుకోసం ఆర్టీసీ బస్టాండులో జయమ్మ వేచి ఉండగా బస్టాండు పైకప్పు పెచ్చులూడి ఆమె తలపై పడ డంతో ఆమెకు గాయాలయ్యాయి. వెంటనే ఆర్టీసీ సిబ్బంది ఆమెను స్థానిక ప్రభుత్వాసుపత్రిలో వైద్య చికిత్స చేయించారు. దీనిపై ఆర్టీసీ డీఎం శ్రీనివాసులు మాట్లాడుతూ అనేక దఫాలు ఆర్టీసీ బస్టాండు మరమ్మతులకు ప్రతిపాదనలు పంపామన్నారు. గాయాలైన మహిళకు ఆసుపత్రిలో చికిత్స చేయించి ఇంటికి పంపినట్లు తెలిపారు.

విద్యతోనే ఉన్నతస్థానం

జమ్మలమడుగు, మే 9: విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉన్నతస్థానంలో నిలుస్తారని ఏపీ పద్మశాలీయ సంఘం రాయలసీమ ఇన్‌ఛార్జి సిలివేరు దశరథ రామయ్య, కడపజిల్లా పద్మశాలీయ సంఘం అధ్యక్షుడు చింతలపల్లె రుద్ర మహేశ్వరుడు సూచించారు. గురువారం జమ్మలమడుగు పట్టణంలోని శ్రీ సరస్వతి విద్యామందిరంలో పద్మశాలీయ సంఘం ఆధ్వర్యంలో పరిసర ప్రాంతాల్లోని 10వ తరగతిలో ఉన్నత మార్కులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. పద్మశాలీయ సంఘం ఉపాధ్యక్షులు సిలివేరి వెంకటేశ్వర్లు, మేడికుర్తి ఆదినారాయణ, చింతలపల్లె గురునాగేశ్వరరావు, ఆరవేటి తిరువెంగళప్ప, దొంతి వెంకటేశ్వర్లు, వొగ్గు జయరాం, కె.సూర్యనారాయణ పాల్గొన్నారు.

రామాయపల్లెలో కాంగ్రెస్ ప్రచారం

పోరుమామిళ్ల, మే 9 : పోరుమామిళ్ల పంచాయతీ పరిధిలోని రామాయపల్లెలో కాంగ్రెస్ అభ్యర్థి ఎన్‌డీ విజయజ్యోతి ఎన్నికల ప్రచారం చేశారు. గురువారం సాయంత్రం ఆమె రామాయపల్లెలో ఇంటింటి ప్రచారం నిర్వహించి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా షర్మిలను గెలిపించాలన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా రావాలంటే కాంగ్రెస్‌తో సాధ్యమని అన్నారు.

ఓటు వేసి గెలిపించండి - అల్లె

జమ్మలమడుగు, మే 9: జమ్మలమడుగు నియోజకవర్గంలో ఓటర్లు సార్వత్రిక ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించాలని స్వతంత్ర అభ్యర్థి అల్లె ప్రభావతి అభ్యర్థించారు. గురువారం జమ్మలమడుగులోని మోరగుడి, జమ్మలమడుగు తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాగా హస్తం గుర్తుకు ఓటు వేయాలని కాంగ్రెస్ అభ్యర్థి పాముల బ్రహ్మానందరెడ్డి ప్రచారం చేశారు.

నియోజకవర్గాన్ని రెట్టింపు అభివృద్ధి చేస్తా : ఆది



ఆర్టీపీపీ కలమల్లలో ప్రసంగిస్తున్న బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి



మైలవరంలో కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎన్డీయే కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి

జమ్మలమడుగు, మే 9: జమ్మలమడుగు నియోజకవర్గాన్ని గతంలో కంటే రెట్టింపుతో అభివృద్ధి చేస్తానని జమ్మలమడుగు ఎన్డీయే కూటమి అసెంబ్లీ అభ్యర్థి చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి ఓటర్లకు తెలిపారు. బుధవారం జమ్మలమడుగు పట్టణంలోని టీచర్స్ కాలనీలో పలువురు ఆహ్వానించి ఎన్డీయే కూటమిలోకి చేరారు. అనంతరం జమ్మలమడుగు పట్టణంలోని ఆర్ఎంపీ డాక్టర్లు కొందరు ఆదినారాయణరెడ్డిని ఆహ్వానించి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. 20 మంది ఆర్ఎంపీ డాక్టర్లు ఎన్డీయే కూటమిలో చేరి ఆదినారాయణరెడ్డిని పూలమాలతో సత్కరించారు. ఆర్ఎంపీ డాక్టర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్‌కరీముల్లా, శ్రీనివాసమూర్తి, శేషగిరిరావు, చంద్ర, అమీర్, లక్షుమయ్య, వినోద్ పాల్గొన్నారు. కాగా జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని శివారెడ్డి కాలనీలో 25 కుటుంబాలవారు బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ రాజేష్‌రెడ్డి సమక్షంలో ఎన్డీయే కూటమిలోకి చేరారు.

మైలవరం..: మండల కేంద్రమైన మైలవరం, దొమ్మరనంద్యాల, వేపరాల గ్రామాల్లో వైసీపీ నుంచి టీడీపీలోకి 150 కుటుంబాల వారికి పార్టీ కండువాలు కప్పి ఎన్డీయే కూటమి జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి సి.ఆదినారాయణరెడ్డి గురువారం పార్టీలోకి ఆహ్వానించారు. వేపరాల ఎంపీ టీసీ కుమార్, మైలవరం మాజీసర్పంచ్ భీముడు నాయక్ దంపతులు, దొమ్మర నంద్యాల యనమల సుబ్బిరెడ్డి, యనమల రామచంద్రుడు, శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో 150 కుటుంబాలకు పైగా ఎన్డీయే కూటమిలో చేరా రు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మల్లేల గురివిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, బూసిరెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

జగన్‌కు చెక్ పెట్టకపోతే... ఆర్టీపీపీ మూతే..

ఎర్రగుంట్ల, మే 9: జగన్‌కు చెక్‌పెట్టి, చంద్రబాబును గెలిపిస్తేనే ఆర్టీపీపీకి మనుగడ ఉంటుందని ఎన్డీయే ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు చదిపిరాళ్ల భూపేశ్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి పేర్కొన్నారు. గురువారం రాత్రి ఆర్టీపీపీ, కలమల్ల, చిన్నదండ్లూరు, ఇల్లూరు గ్రామాల్లో వారు రోడ్‌షో నిర్వహించారు. ఆర్టీపీపీ, కలమల్ల గ్రామాల్లో ఏర్పాటు చేసిన రోడ్‌షో, సభల్లో వారు ప్రసంగిస్తూ జగన్ రాగానే ఆర్టీపీపీని మూత వేసేందుకు ప్రయత్నించాడని విమర్శించారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఆది మాట్లాడుతూ ఆర్టీపీపీలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేస్తానని తన పాదయాత్రలో జగన్ ఇచ్చిన హామీని తుంగలో తొక్కి కార్మికులను మోసం చేశాడని విమర్శించారు. కాగా ప్రతి ఒక్కరూ ఆలోచించి ఓటు వేయాలని ఎంపీ అభ్యర్థి సి.భూపేశ్‌రెడ్డి ఓటర్లను కోరారు. ఎంపీగా తనను, ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డిని గెలిపించాలని కోరారు.నాయకులు మేకల మోహన్‌రెడ్డి, కలమల్ల బాబు, మేకల జగన్ మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వి.క్రిష్ణయ్య, మాజీ ఎంపీటీసీ ఎన్.నాగమణి, సుబ్బరామయ్య, తారక, యూనియన్ నాయకులు, కాంట్రాక్టు కార్మికులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఎన్డీఏతోనే సమగ్రాభివృద్ధి : విజయమ్మ





బద్వేలు...చింతల చెరువుగ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ రోశన్న, అట్లూరు.. బొజ్జ రోశన్న సమక్షంలో టీడీపీలో చేరిన ఉప్పుటూరు వాసులు

కాశినాయన మే9: ఎన్డీఏ అధికారంలోకి వస్తే రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెందుతుందని మాజీ ఎమ్మెల్యే కే.విజయమ్మ పేర్కొన్నారు. గురువారం జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డితో కలిసి వడ్డమాను, వంకమర్రి గ్రామాల్లో పర్యటించి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జారోశన్న కమలం గుర్తుకు ఓటెయ్యాలని ప్రజలను కోరుతూ బ్యాలెట్ నమూనాను ప్రజలకు చూపించారు. అనంతరం వంకమర్రి గ్రామంలో కస్తూరి వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో 30 కుటుంబాలు,వడ్డమానులో ఎన్ శ్రీనివాసులరెడ్డి, కావూరి వెంకటరాంబాబు, పామూరి వెంగయ్య చౌదరి,ఎంబడి జగదీష్ ఆధ్వర్యంలో 30 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరాయి. ఈకార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రాజారెడ్డి, పంగా రవీంద్రా రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, ముడమాల రమణారెడ్డి,విజయ్‌కుమార్‌రెడ్డి ,దుగ్గిరెడ్డి, ఏ.రమణారెడ్డి,అడవిరాముడు, రామచంద్రయ్య,క్రిష్ణయ్య పాల్గొన్నారు.

అట్లూరు..: అట్లూరు మండలంలోని ఉప్పుటూరు కాలనీవాసులు వైసీపీని వీడి 50 కుటుంబాలు గురువారం టీడీపీలో చేరారు. వీరు ఎంసూర్య నారాయణరెడ్డి, నందగోపాల్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, అరవ శ్రీనివాసులరెడ్డి, రెడ్డయ్య, రాజశేఖర్‌రెడ్డి, ఎల్.నారాయణరెడ్డి, ఎస్.సుబ్బారెడ్డి, కొత్తపు మునిరెడ్డి, రఘురామ పరశురాంముడు ఆధ్వర్యంలో బద్వేలు బీజేపీ అభ్యర్థి బొజ్జ రోశన్న సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. చేరిన వారు వలంటీరు పొత్తపి సునీల్ చిన్న సుబ్బయ్య, వెంకటసుబ్బయ్యతో పాటు మరికొందరు చేరారు. అనంతరం రాష్ట్ర పంచాయతీరాజ్ సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షుడు మునిరెడ్డి, స్థానిక సర్పంచ్ లోకేశ్వరి ఆధ్వర్యంలో తంబళ్లగొంది పంచాయతీలోని సోమేశ్వరం, బీబీసాహె బ్‌పేట ఎర్రబల్లి, అట్లూరు, కుంభగిరి, కొండూరురెడ్డి, ముత్తుకూరు మాదాపూర్ వేమలూరు, కమలకూరు, మన్యంవారిపల్లె, గుజ్జులవారిపల్లె గ్రామాల్లో ఇంటింటి ప్రచారంచేశారు. ఈ కార్యక్రమంలో పాటూరు రాధాక్రిష్ణారెడ్డి, జయక్రిష్ణారెడ్డి, మన్యం మహేశ్‌రెడ్డి, సుదర్శన్‌రావు, రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

బి.కోడూరు..: మండల పరిధిలోని మేకవారిపల్లె, మూలవారిపల్లె, పందివీడు గ్రామ పంచాయతీల్లో మండల టీడీపీ పార్టీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి అభ్యర్థి బొజ్జ రోశన్నకు కమలం గుర్తుంపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు విభాగ అధ్యక్షుడు రమణారెడ్డి, గోడి రమణారెడ్డి, శేషారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, తిరుపతిరెడ్డి, పెద్దిరెడ్డి నరసింహారెడ్డి, రామిరెడ్డి, రామసుబ్బారెడ్డి, రాఘవరెడ్డి, దుగ్గిరెడ్డి, పవన్, బొమ్మన పెంచలయ్య, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: వైసీపీని సాగనంపండని బ ద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ అన్నారు. గురువారం పోరుమామిళ్లలోని పార్టీ కార్యాలయంలో బలిజకోటవీధికి చెందిన పది కుటుంబాల వారు సర్పంచ్ యనమల సుధాకర్ మార్కెట్ యార్డు మాజీ వైస్‌ఛైర్మన్ ఎస్ఎంబాషా, సీతా వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. అలాగే అక్కల్‌రెడ్డిపల్లె పంచాయతీ పరిధిలోని వాసుదేవాపురం గ్రామానికి చెందిన 15 కుటుంబాలవారు టీడీపీ నాయకులు గంటెన జయరాముగౌడ్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు నగరి భైరవ ప్రసాద్, రామసుబ్బారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.కాగా కూటమి అభ్యర్థి బొజ్జ రోశన్న గెలుపు కోసం టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించారు. రంగసముద్రం పంచాయతీ పరిధిలోని పోలింగ్ బూత్‌లలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు ఇంటింటి ప్రచారం చేసి ఎమ్మెల్యేగా బొజ్జ రోశన్న, ఎంపీగా భూపేశ్‌ను గెలిపించాలని కోరారు.

కలసపాడు..: కలసపాడు మండలంలోని తెల్లపాడు పంచాయతీలో బొజ్జ రోశన్న గెలుపు కోసం ఆయన సోదరుడు బొజ్జ చిన్నయ్య ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

బద్వేలుటౌన్..: బద్వేలు నియోజకవర్గ ప్రజలు ఒక్క అవకాశం ఇచ్చి గెలిపిస్తే నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ రోశన్న అన్నారు. గురువారం చింతల చెరువు గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రవికుమార్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే యాదవుల సంక్షేమం... అభివృద్ధి

బద్వేలుటౌన్ మే 9 : తెలుగుదేశంపార్టీహయాంలోనే యాదవులకు సంక్షేమం, అభివృద్ధి జరిగిందని మాజీఎమ్మెల్యే విజయమ్మ, టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఆర్ఆర్ కళ్యాణమండపంలో యాదవుల ఆత్మీయసమావేశం నిర్వహించారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకిరాగానే యాదవులకు మంచి గుర్తింపునిచ్చి, ప్రత్యేకకార్పొరేషన్లు ఏర్పాటుచేసి యాదవులను ఆర్థికంగా ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కువైత్‌యాదవసంఘం అధ్యక్షుడు ఉంటా నరసింహులు, సింగరయ్య, వెంగల్‌రెడ్డి, రాగిమాను ప్రతాప్‌కుమార్, మిత్తికాయల రమణ, వెంకటయ్యయాదవ్, గురురాజా, మస్తాన్, కొండయ్య, సుబ్బరాయుడు, యాదవులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



బద్వేలు..యాదవుల ఆత్మీయసమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ యువనేత రితేష్‌కుమార్‌రెడ్డి, చిత్రంలో విజయమ్మ

ప్రజాస్వామ్య పరిరక్షణకు పెద్దపీట వేస్తా





ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

- అక్రమార్జన కోసం రాజకీయాల్లోకి వచ్చేవారు వ్యవస్థను పతనం చేస్తారు
- రాచమల్లు లాంటి కబ్జాదారులను ఆదరిస్తే ఆస్తులు కొల్లగొడతారు
- స్వేచ్ఛాయుతంగా ప్రశ్నించే ప్రొద్దుటూరు గొంతుకను కాపాడుకుందాం
- ప్రొద్దుటూరు అభివృద్ధి కోసం ప్రజా మేనిఫెస్టోను అమలు చేస్తాం
- ప్రొద్దుటూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు, మే 9: "అక్రమార్జన కోసం రాజకీయాల్లోకి వచ్చేవారు వ్యవస్థను పతనం చేస్తారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకునే రాజకీయాలకే పెద్దపీట వేయాలి. తాత్కాలిక ప్రలోభాలకు లోనైతే ప్రజల భవిష్యత్తు అంధకారమౌతుంది. ఈ ఐదేళ్లలో ఎన్నడూ చూడనంత దౌర్జన్యాలు, దోపిడీని ప్రత్యక్షంగా చవిచూశాం. పరిపాలన అంటే ఎట్టా వుండకూడదో జగన్ ప్రభుత్వం నుంచి చాలా గుణపాఠాలు నేర్చుకోవాలి. ప్రజలందరి సంపద అయిన ప్రకృతి వనరులను అడ్డంగా దోచుకోవడం అక్రమంగా సంపద పోగేసుకోవడం ఎట్లాగో ఈ ఐదేళ్ల కాలంలో జగన్ ఒక నమూనా ట్రెండ్‌ను సెట్ చేశాడు. ఆయనతో పాటు ఆయన ఎమ్మెల్యేలను ఈ విషయంలో బాగా తీర్చిదిద్దాడు. దేశమంతటా రాష్ట్రానికి ఒక ముఖ్యమంత్రి వుంటే ఏపీలో తన ఎమ్మెల్యేలను నియోజకవర్గానికి ముఖ్యమంత్రిని చేశాడు. ప్రొద్దుటూరు నియోజకవర్గ ముఖ్యమంత్రి రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ఈ ఐదేళ్లలో చేయని దుర్మార్గం లేదు. భూకబ్జాల నుంచి నకిలీ నోట్ల ముద్రణ వరకు నిరాటంకంగా సాగించాడు. ఇచ్చిన హామీలను మాటల గారడీతో మాయ చేయగల సమర్థుడు. ఇప్పుడు మళ్లీ మనముందుకు ఓట్లడగడానికి వస్తున్నాడు. మరో సారి అవకాశమిస్తే మళ్లీ మరో ఐదేళ్లు అతని అరాచకాలు, భూదందాలు, దౌర్జన్యాలు చూడటమే కాదు ఏకంగా మన ఆస్తులను గుంజుకుంటాడు. ఇది నేను చెప్పే అభిప్రాయం కాదు ప్రొద్దుటూరు ప్రజల్లో ఏర్పడిన అభిప్రాయం. 35 ఏళ్ళ రాజకీయాల్లో వున్న నేను ఏమి సంపాదించానో ప్రజలందరికీ తెలుసు. నా దగ్గర డబ్బులు లేకపోవడం కాదు అప్పులున్నాయి. ఇల్లు నుంచి పార్టీ కార్యాలయం వరకు బ్యాంకులలో తాకట్టులో వున్నాయి. ఐదేళ్లు అధికారంలో వున్నందుకు రాచమల్లు ఎంత సంపాదించాడో నేను చెప్పనక్కరలేదు. ప్రొద్దుటూరు ప్రజలే చెబుతారు. వందల కోట్లకు పడగలెత్తాడని. రాజకీయాలంటే ప్రజల జీవన విధానంలో మార్పు తీసుకువచ్చేవిగా వుండాలి. దోపిడీకి దౌర్జన్యాలు సాగించేందుకు అండగా వుండేటివి కావని మనం ప్రొద్దుటూరు చరిత్రను తిరగరాయాలి. స్వేచ్ఛాయుతంగా ప్రశ్నించే ప్రొద్దుటూరు గొంతుకను కాపాడుకోవాలి. అందుకే ప్రొద్దుటూరులో మార్పుకోసం అభివృద్ధి కోసం తాను ఏం చేయబోతున్నానని" దాని గురించి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి విడుదల చేసిన మేనిఫెస్టోపై ఆంధ్రజ్యోతితో మాటామంతి పంచుకున్నారు.

ప్రశ్న: అందరూ పార్టీ రాష్ట్రస్థాయి మేనిఫెస్టో విడుదల చేస్తుంటే మీరు ప్రొద్దుటూరుకు ప్రత్యేక మేనిఫెస్టో ఎందుకు విడుదల చేస్తున్నారు ?

జవాబు: రాష్ట్రానికి ఏమి చేస్తారో పార్టీ రాష్ట్ర స్థాయిలో మేనిఫెస్టో విడుదల చేయడం సహజం. కానీ ప్రొద్దుటూరు అభివృద్ధి కోసం నన్ను గెలిపిస్తే వచ్చే ఐదేళ్ళలో ఏమి చేయగలనో హామీ ఇవ్వడం ఎమ్మెల్యేగా ఓటర్లకు తెలియజెప్పడం నా ధర్మం.

ప్రశ్న: రాజకీయాల్లోకి వచ్చినప్పటినుంచి అధికార రాజకీయాల్లోనే ఎక్కువకాలం గడిపారు. ఈ ఐదేళ్ళు మాత్రమే మీరు ప్రతిపక్ష రాజకీయాల్లో వున్నారు కదా ?

జవాబు: 1985లో నేను మొదటి సారి టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచాను. అప్పుడు టీడీపీ అధికారంలో వుంది. ఆ తరువాత 1989 నుంచి 4 పర్యాయాలు కాంగ్రెస్ ఎమ్మెల్యేగా 2009 వరకు కొనసాగాను. 1994 నుంచి 2004 వరకు టీడీపీ ప్రభుత్వం వున్నది. అప్పుడు పదేళ్ళు ప్రతిపక్ష ఎమ్మెల్యేగా వుండి కూడా అభివృద్ధి కోసం పాటు పడ్డాను. 2009 నుంచి 2019 వరకు పదేళ్లు ఎమ్మెల్యేగా లేకున్నా అధికార రాజకీయాల్లో వుండి ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధిని రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెల స్థాయిని బట్టి అభివృద్ధి పనులు చేపట్టాను. ఈ ఐదేళ్లలో ప్రతిపక్షంలో వున్నా నిత్యం ప్రజా సమస్యల కోసం ప్రభుత్వంపై పోరాడే వాడిని.

ప్రశ్న: మూడున్నర దశాబ్దాలలో మీరు చేయలేని పనులు ఏమైనా రాబోయే ఐదేళ్ళలో చేయగలరా ?

జవాబు: అవును ! మనం అనుకున్నవన్నీ చేయడానికి ప్రభుత్వం వద్ద బడ్జెట్ వుండాలి. అవి నా హయాంలో చేయాలని మిగిలి పోయిన పనులు చేద్దాం అనుకుంటున్నా. నేను ఈ 35 ఏళ్ళ కాలంలో ఏమిచేశాను ఇప్పటికే ప్రజలకు అనేక మాధ్యమాల ద్వారా తెలియజేశాను. అయితే రాబోయే ఐదేళ్లలో నన్ను మరోసారి ప్రొద్దుటూరు ప్రజలు ఆదరిస్తే ఏం చేయాలనో ప్రొద్దుటూరు ప్రజా మేనిఫెస్టోలో తెలియజేశాను.

ప్రశ్న: ప్రొద్దుటూరు ప్రజా మేనిఫెస్టో ప్రత్యేకత ఏమిటి ?

జవాబు: ప్రొద్దుటూరుకు 350 పడకలతో జిల్లా ఆసుపత్రిగా అభివృద్ధి చేయగలిగాం. జగన్ మెడికల్ కాలేజీకి అన్ని అర్హతలు వున్న ప్రొద్దుటూరును కాదని 100 పడకలున్న పులివెందుల ఆసుపత్రికి మెడికల్ కాలేజీ ఏర్పాటు చేశాడు.నియోజకవర్గ ఎమ్మెల్యే రాచమల్లు కనీసం మాట మాత్రమైన ప్రొద్దుటూరుకు మెడికల్ కాలేజీ ఇవ్వమని కోరలేదు. అందుకే జిల్లాకే సెంటర్ పాయింట్‌గా వున్న ప్రొద్దుటూరలో మెడికల్ కాలేజీ తీసుకురావాలనే లక్ష్యంతో మేనిఫెస్టోలో పెట్టాం.

● ప్రశాంత ప్రొద్దుటూరుకు పాటుపడతాం

ప్రొద్దుటూరులో గతంలో ఫ్యాక్షన్ రాజకీయాలు నడిచి ఎంతో నష్టపోయాం. ఆ తరువాత నేనే ఎమ్మెల్యేగా అయినప్పటి నుంచి ఫ్యాక్షన్ రాజకీయాలకు స్వస్తి చెప్పాను. హత్యలు చేసినవారిని జైలుకు పంపి శిక్షలు పడేలా చేసి మార్పు తీసుకువచ్చాను. వైసీపీ పాలనలో మళ్లీ ప్రొద్దుటూరులో హత్యారాజకీయాలు పెరిగిపోయాయి. ప్రజలు శాంతియుత జీవనాన్ని గడిపేలా హత్యారాజకీయాలకు చెక్‌పెడతాం.

● చిన్న మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటు :

గతంలో రామేశ్వరం, కొత్తపల్లె గ్రామ పొలాలలో పారిశ్రామిక వాడలను ఏర్పాటు చేశాం. కొత్త పారిశ్రామిక వాడలకోసం స్థలాలు సేకరిస్తాం. ఇక్కడి నిరుద్యోగ యువతకు ఇంకా ఉద్యోగ అవకాశాలు కల్పించి పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలనుకునే వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రుణాలకు సహకారం అందిస్తాం.

● రైతులకు సహకారం

రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో రైతులకు సబ్సిడీ కింద డ్రిప్ ఇరిగేషన్ వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లు అందిస్తాం. శనగలు, జొన్నల కొనుగోలు కేంద్రాల పరిమితిని పెంచేలా కృషి చేస్తాం. మైలవరం నుంచి ప్రొద్దుటూరు వరు కాలువలను ఉపకాలువలను పునరుద్ధరిస్తాం. రైతన్నలకు వీలైనంత సహకరిస్తాం.

స్వర్ణకారుల ఉపాధి కల్పన

గోల్డ్ మేకింగ్ గోల్డ్ డిజైనింగ్ స్కిల్స్‌కు ట్రైనింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తాం

స్కిల్ డెవలప్‌మెంట్

చేనేత కార్మికులు, ఇతర వృత్తుల కోసం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్స్, దుస్తుల ఉత్పత్తి పరిశ్రమ ఏర్పాటు చేస్తాం.

డబుల్ రోడ్ల నిర్మాణం

మైదుకూరు లింక్ రోడ్డు నుంచి వాసవి సర్కిల్ మీదుగా జమ్మలమడుగు లింక్‌రోడ్డు వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపడతాం.

కూరగాయల మార్కెట్ నిర్మాణం పూర్తి చేయిస్తాం

నిర్మాణ దశలో వున్న కూరగాయల మార్కెట్‌ను త్వరితగతిన పూర్తి చేయించి మునిపటి షాపుల యజమానులకు కేటాయించి అదనపు గదులు పారదర్శకంగా వేలం పాటలు నిర్వహించి వ్యాపారులకు అప్పచెబుతాం.

రాజోలి ఆనకట్టను పూర్తి చేస్తాం

రాజోలి ఆనకట్ట నిర్మాణం పూర్తి చేసి ఆయకట్టు ప్రాంతాన్ని పెంచి రైతులకు అండగా వుంటాం.

కమ్యూనిటీ భవనాలు నిర్మిస్తాం

కమ్యూనిటీ భవనాలకు స్థలాలు కేటాయించి నూతన భవనాలు నిర్మిస్తాం. సామాజిక వర్గాల అభ్యున్నతికి తోడ్పతాం.

స్పోర్ట్స్ కాంప్లెక్స్: యువ క్రీడాకారుల కోసం పట్టణ పరిసర ప్రాంతాల్లో స్థలం కేటాయించి దశల వారిగా స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం చేపడతాం.

డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరిస్తాం: డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరించి కాలువల నిర్మాణం చేపడతాం. మురుగు నీటి శుద్ధి ప్లాంటు ఏర్పాటు చేస్తాం.

మనఊరు మన దుకాణం: పసిడిపురిలో చిన్న మధ్య తరహా వ్యాపారులంతా బలహీనపడకుండా మొదటి ప్రాధాన్యతగా వ్యాపారులకు మద్దతుగా నిలబడుతాం.

మహిళా సాధికారత: మహిళలు స్వయం ఉపాధి ఏర్పాటుచేసుకుని తమ కాళ్ళమీద తాము నిలబడేలా వృత్తి నైపుణ్య కోర్సులలో (టైలరింగ్, మగ్గం, హ్యాండీ క్రాఫ్ట్, బ్యూటీషియన్, డిజిటల్ మార్కెటింగ్) శిక్షణలిప్పిస్తాం.

ఈ కార్యక్రమాలే కాకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే అన్ని సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూస్తాం. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయిస్తాం. వినాయకనగర్ నుంచి రైల్వేస్టేషన్‌వరకు లింకు రోడ్డును విస్తరించి అభివృద్ధి పరుస్తాం. మట్కారాయుళ్ళు, జూదగాళ్ళు, క్రికెట్ బుకీలు లేకుండా గతంలో లాగా నగర బహిష్కరణ చేస్తాం. ప్రొద్దుటూరును కార్పొరేషన్ స్థాయికి పెంచి రాయలసీమలోనే గొప్ప నగరంగా తీర్చిదిద్దుతాం.



ప్రొద్దుటూరు ప్రజా మేనిఫెస్టో విడుదల చేస్తున్న నంద్యాల వరదరాజులరెడ్డి

12 ఏళ్లుగా కష్టాలు చూశాను.. కన్నీళ్లు తుడుస్తాను...!

- జగన్ మాదిరి కాదు.. ఒక్క ఛాన్స్ ఇవ్వండి
- రాజోలి నిర్మించి నీళ్లు పారించి చూపుతా
- ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీరిస్తా
- పరిశ్రమ స్థాపిస్తా.. యువతను ఆదుకుంటా
- శీతల గిడ్డంగులు కడతా.. ఉల్లి రైతునూ ఆదుకుంటా
- ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తా
- వంద పడకల ఆసుపత్రి నిర్మిస్తా
- మైదుకూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్



మైదుకూరు, మే 9: 'నేను డబ్బుమీద ఆశతో రాజకీయాల్లోకి రాలేదు. గత 12 ఏళ్ల నుంచి మైదుకూరు నియోజకవర్గ ప్రజల కష్టాలు చూస్తున్నా.. 2015లో మున్సిపాలిటీ ప్రజల తాగునీటి కష్టాలు చూడలేక అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు దగ్గరకు వెళ్లి తెలుగుగంగ ద్వారా ఎర్రచెరువుకు నీటి విడుదలకు శాశ్వత జీవో తీసుకొచ్చా.. మైదుకూరుకు ఉర్దూ జూనియర్ కళాశాల అనుమతి తీసుకొచ్చా. మైదుకూరును ప్రత్యేకంగా రూ.900 కోట్లతో నియోజకాభివృద్ధి చేపట్టా. టీటీడీ ఛైర్మన్‌గా ఉంటూ వేలాది మందికి ఆ తిరుమలేశుని దర్శనభాగ్యం కల్పించా. మాధవరాయస్వామి ఆలయానికి ఆదాయం వచ్చేలా టీటీడీ కళ్యాణ మండపాన్ని అనుసంధానం చేశా. ఇలా చెప్పుకుంటూ పోతే నేను ఎన్నికల్లో ఓటమి చెందినా మైదుకూరు ప్రజల కోసం ఎంతో చేశా.. నేను రాజకీయాల్లోకి వచ్చింది కేవలం ప్రజలకు సేవ చేయడంతో పాటు మైదుకూరు నియోజకవర్గాన్ని అభివృద్ధిలోకి తీసుకొచ్చేందుకే. ఈ ఎన్నికల్లో నాకు ఒక్కసారి ఛాన్స్ ఇస్తే ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు రాజోలి నిర్మించి రైతులు మూడుకార్ల పంటలు పండించుకునేలా చేస్తానంటూ టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. ఆయన ఆంధ్రజ్యోతితో పలు విషయాలు వెల్లడించారు.

రాజోలి నిర్మించి 1.25 లక్షల ఎకరాలకు నీరిస్తా

తండ్రి, తనయుడు ఇద్దరూ రాజోలి జలాశయం కోసం శంకుస్థాపనలు చేసి కనీసం గంప మట్టి అయినా తీయలేదు. మళ్లీ ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికల్లో గెలిపిస్తే రాజోలి నిర్మిస్తా అంటూ జగన్ మోసపూరిత హామీ ఇచ్చి వెళ్లాడు.. నేను మాత్రం హామీ ఇవ్వను. ఏకంగా రాజోలి జలాశయం కట్టి నీళ్లు పారిస్తా.. ఇందుకోసం రూ.2 వేల కోట్ల వ్యయంతో 2.95 టీఎంసీల సామర్థ్యంతో 91 వేల ఆయకట్టు స్థిరీకరణకు 2.95 టీఎంసీల సామర్థ్యంతో జలాశయం నిర్మిస్తా.

ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేస్తా

బ్రహ్మంసాగర్ కింద 90 వేల ఎకరాలతో పాటు 72 మైనర్ ఇరిగేషన్, చెరువుల కింద 35 వేల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించేలా దువ్వూరు మండలం పెద్ద జొన్నారం వద్ద కుందూనది నుంచి ఎత్తిపోతల పథకాన్ని దాదాపు రూ.600 కోట్లతో ఏర్పాటు చేస్తా. దీంతో దువ్వూరు మండలం చల్లబసాయిపల్లె వద్ద ఉన్న 1వ ఉప జలాశయంలో 2.133 టీఎంసీలు నీరు నిల్వ, మైదుకూరు మండలం గంజికుంట వద్ద ఉన్న 2వ జలాశయంలో 2.44 టీఎంసీల నీరు, బి.మఠం వద్ద బ్రహ్మంసాగర్‌లో 17.73 టీఎంసీల నీరు నిల్వ చేసుకునే అవకాశముంది. అన్ని చెరువులకు నీరిచ్చి ప్రతి రైతూ మూడుకార్ల పంటను పండించుకునేలా చేస్తా. అలాగే వేలాది మందికి రక్షిత తాగునీరు అందిస్తా.

శీతల గిడ్డంగులు నిర్మిస్తా.. ఉల్లి రైతును ఆదుకుంటా

ప్రపంచ ఖ్యాతి పొంది, విదేశీమారక ద్రవ్యం తీసుకొచ్చే కృష్ణాపురం ఉల్లికి పేరుంది. ఉల్లిసాగు, విక్రయాల్లోనూ రైతులు ఒడిదుడుకులు ఎదుర్కొంటున్నారు. వైసీపీ ప్రభుత్వం రైతులను ఆదుకోకపోవడంతో నష్టాలు చవిచూడడంతో పాటు కేపీ ఉల్లిని సాగు చేయడమే పూర్తిగా తగ్గించేశారు. వీరి కోసం శాశ్వత పరిష్కారం చేస్తా. శీతల గిడ్డంగులు నిర్మించడంతో పాటు ప్రభుత్వమే కొనుగోలు చేసి ప్రపంచ మార్కెట్లో ఉల్లి రైతును ప్రోత్సహిస్తా.. పసుపు రైతులను కూడా ఆదుకుంటా.. రైతు గొప్పతనం ఏంటో చూపిస్తా.

కేసీ కెనాల్ స్థిరీకరిస్తా..

కర్నూలు-కడప కాలువ ఆయకట్టు రైతుల కోసం కాలువపై పర్యవేక్షణ చేస్తూ నీటి సరఫరాకు ఎటువంటి ఇబ్బందులకు లేకుండా స్థిరీకరణ చేస్తా. ఖరీఫ్, రబీపంటలు రైతులు సాగు చేసుకునేందుకు తగిన ఏర్పాట్లు చేస్తా.

ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేస్తా

యువతను దృష్టిలో పెట్టుకొని మైదుకూరులో ఇండోర్ స్టేడియం, క్రీడా ప్రాంగణం, పార్కు, ఉద్యానవనం ఏర్పాటు చేస్తా.

పరిశ్రమ ఏర్పాటే యువతకు నేస్తం..

నియోజకవర్గంలో యువతీ యువకుల కోసం ఓ పరిశ్రమనే తీసుకొచ్చి ఉద్యోగాలు కల్పిస్తా. లేదా ఉద్యోగాలు వచ్చే వరకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇప్పిస్తా. చంద్రబాబు సీఎం కాగానే మెగా డీఎస్సీ పైనే తొలి సంతకం చేస్తారు.

సుందరీకరణ, పట్టణాభివృద్ధి

ఈ జగన్ ప్రభుత్వంలో సుందరీకరణ, పట్టణాభివృద్ధి కలగానే మిగిలిపోయింది, బ్రహ్మంగారి మఠంలో బ్రహ్మంసాగర్ వద్ద ఎకో పార్కును ఏర్పాటు చేస్తా. మైదుకూరు పట్టణాభివృద్ధికి దాదాపు 100 కోట్లతో సిమెంట్ రోడ్లు, తారురోడ్లు, వంకల ఆధునికీకరణ పనులు చేపడతా. కేసీ కాలువతో పాటు పట్టణం మీదుగా వెళ్తున్న వంకలతో పాటు ఎర్రచెరువు కట్టపై పచ్చదనం, ఉద్యానం, వీధి దీపాలు, ప్రధాన రహదారుల మధ్యలో డివైడర్లపై విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి ప్రజలకు ఆహ్లాదానిస్తా. మైదుకూరులో క్రీడా మైదానంతో పాటు పార్కును కూడా ఏర్పాటు చేస్తా. ప్రతి వార్డులో అండర్‌డ్రైనేజీ పనులు చేపడతా.

శ్మశానాలను ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పిస్తాం

ప్రతి గ్రామంలో శ్మశానాలు ఏర్పాటు చేసి ప్రహరీని నిర్మించి పిండ ప్రదానాల కోసం గదులు నిర్మించి నీటి వసతిని కచ్చితంగా ఏర్పాటు చేస్తా.

ప్రభుత్వ కళాశాలలకు శాశ్వత భవనాలు

మైదుకూరు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు పాలిటెక్నిక్, ఉర్దూ జూనియర్ కళాశాలకు సొంత భవనాలు ఏర్పాటు చేస్తా. అలాగే అసంపూర్తిగా ఉన్న జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు భవనాలను నిర్మించి విద్యార్థులకు మౌలిక వసతులతో కూడిన నాణ్యమైన విద్య నందిస్తా.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తా

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు వర్తించేలా చేస్తా.

టీడీపీ అందించే సంక్షేమ పథకాలు

- 18 నుంచి 59 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1500
- ప్రతి మహిళకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం
- ప్రతి ఇంటికి ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితం
- కుటుంబంలో చదువుతున్న పిల్లలందరికీ ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15,000
- వృద్ధులు, వికలాంగులకు నెలకు రూ.4 వేలు పింఛన్
- దివ్యాంగులకు నెలకు రూ.6 వేలు పింఛన్
- డ్వాక్రా మహిళలకు రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు
- ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు ఆర్థిక సహాయం
- పట్టణాల్లో 2, గ్రామాల్లో 3 సెంట్ల స్థలంలో ఇళ్ల నిర్మాణం
- మైనార్టీ, వెనుకబడిన తరగతుల వారికి కార్పొరేషన్ల ద్వారా రూ.5 లక్షల వరకు వడ్డీలేని రుణాలు
- ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 ఏళ్లకే నెలనెలా 4 వేలు పింఛను
- నిరుద్యోగులకు ప్రతినెలా రూ.3 వేలు భృతి
- హజ్ యాత్రికులకు రూ.లక్ష సహాయం
- రంజాన్ తోఫా
- హిందువులకు ముఖ్యమైన పండుగలకు ఉచిత నిత్యావసర సరుకులు
- ప్రభుత్వ ఉద్యోగులకు 1వ తేదీనే జీతాలు
- నిత్యావసర వస్తువుల ధరలకు అడ్డుకట్ట

వడదెబ్బకు వృద్ధుడు మృతి

ముద్దనూరు మే 9: మండల పరిధి కమ్మవారిపల్లెకు చెందిన నీలకంఠం గంగన్న(62) గురువారం మధ్యాహ్నం వడదెబ్బకు మృతి చెందినట్లు మృతుని బంధువులు తెలిపారు. బంధువుల సమాచారం మేరకు.. గంగన్న మంగళవారం వడదెబ్బకు గురయ్యాడు. అస్వస్థతకు లోనవడంతో వెంటనే ముద్దనూరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. సెలైన్ బాటిల్ ఎక్కించుకొని ఇంటి తీసుకొని వచ్చినట్లు తెలిపారు. గురువారం మధ్యాహ్నం మృతి చెందాడని, ఈ మేరకు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించినట్లు మృతుని బంధువులు తెలిపారు.

ఎమ్మెల్యే రాచమల్లు అనుచరుడిపై కేసు నమోదు

ప్రొద్దుటూరు క్రైం, మే 9: ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి అనుచరుడు భూమిరెడ్డి సుదర్శన్‌రెడ్డిపై స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ శ్రీకాంత్ వివరాల మేరకు.. ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో ఓటర్లకు డబ్బులు పంపిణీ చేస్తుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ సీఐ పట్టుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి రూ.2.90 లక్షలు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



పోలీసులకు పట్టుబడ్డ భూమిరెడ్డి సుదర్శన్‌రెడ్డి